తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
11-09-2026
శుక్రవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 214
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
సిరి
People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

# రూ.80 కోట్లు ఆదా చేస్తామన్నా
# మాట వినలేదు!

## కాంట్రాక్టర్ కోసమే జెన్‌కో నిధుల లూటీ

- వైటీపీఎస్‌లో ప్రైవేటు ఏజెన్సీకే టెండర్ల ఖరారు
- రూ.80 కోట్లు నష్టమని చెప్పినా పట్టించుకోని యాజమాన్యం
- ఎల్-1 బిడ్డర్‌కు 10.5% అధిక ధరకు అప్పగింత
- సీనియర్ ఐఏఎస్ కనుసన్నల్లోనే టెండర్ల మాయాజాలం
- సిబ్బంది ఉన్నా అదనంగా 1254 పోస్టుల సృష్టి
- పీపీటీ ద్వారా నిరూపించినా వినని మొండి వైఖరి
- కోల్, యాష్ ప్లాంట్లను కలిపేసి రేట్ల పెంపు
- మూడేళ్ల నిర్వహణకు రూ.255 కోట్ల భారీ వ్యయం
- టెండర్ ఆమోదం కోసం ప్రభుత్వానికి చేరిన ఫైల్
- నేడు రాష్ట్రవ్యాప్తంగా జెన్‌కో సీఈల ఘెరావ్
- ప్రైవేటీకరణపై పోరుబాటుకు సిద్ధమైన విద్యుత్ సంఘాలు



తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థను అంచెలవారీగా కార్పొరేట్ శక్తులకు, ప్రైవేటు కాంట్రాక్టర్లకు కట్టబెట్టే కుట్రలు పారకాష్టకు చేరాయి. దామరచర్ల యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ పరిధిలోని కోల్ హ్యాండ్లింగ్, యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల నిర్వహణ టెండర్లలో భారీ కుంభకోణం చోటుచేసుకుంది. సంస్థ ఉద్యోగులతోనే పనులు చేయిస్తే మూడేళ్ల కాలంలో ఏకంగా రూ.80 కోట్ల ప్రజాధనం ఆదా అవుతుందని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నిరూపించినా జెన్‌కో యాజమాన్యం కనికరించలేదు.

తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్

కేవలం ఒక నిర్దిష్ట ప్రైవేటు సంస్థకు లబ్ధి చేకూర్చేందుకు అర్హత లేని కంపెనీకి పనులు కట్టబెడుతూ గురువారం సాయంత్రం టెండర్లను ఖరారు చేసి, ప్రభుత్వ తుది ఆమోదం కోసం ఫైలును పంపడం విద్యుత్ వర్గాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది.

మిగతా 2వ పేజీలో..

### అంచనాలకు మించి 10.5% ఎక్కువ..

టెండర్ ప్రక్రియ ప్రారంభం నుంచే ఒక కాంట్రాక్టర్‌కు అనుకూలంగా నిబంధనలను మార్చారన్న ఆరోపణలు నిజమయ్యాయి. సదరు సంస్థ వేసిన ఎల్ 1 బిడ్ వాస్తవ టెండర్ విలువ కంటే ఏకంగా 10.5 శాతం అధికంగా ఉంది. దీనివల్ల కాంట్రాక్టు విలువ అదనంగా రూ.24 కోట్లు పెరిగి, మూడేళ్ల నిర్వహణ మొత్తం అక్షరాలా రూ.255 కోట్లకు చేరింది. వాస్తవానికి ప్రారంభంలో సంస్థ ఇంజనీర్లు అంచనా వేసిన మూల ధరతో పోలిస్తే ఇది ఏకంగా రూ.72 కోట్ల నుంచి రూ.80 కోట్ల వరకు అధిక భారం కావడం గమనార్హం.



## స్పీకర్‌పై వ్యాఖ్యల కేసులో
## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు షాక్?

- తాతా మధు, నవీన్‌రెడ్డి బెయిల్ రద్దుకు పోలీసుల పిటిషన్
- నిబంధనలు ఉల్లంఘించారని నాంపల్లి కోర్టుకు నివేదిక
- అట్రాసిటీ చట్టం వర్తిస్తుందని పోలీసుల వాదన
- రాజకీయ కక్షసాధింపేనంటున్న బీఆర్ఎస్

8

## ఫ్యూచర్ సిటీపై గులాబీ
# దండయాత్ర

- సస్పెన్షన్‌కు బీఆర్ఎస్ కౌంటర్
- తుక్కుగూడ, రావిర్యాలలో కేటీఆర్, హరీశ్‌రావు పర్యటన
- టెస్సెరాక్ట్ భూములపై క్షేత్రస్థాయి పరిశీలన
- రేవంత్ కుటుంబానికి లబ్ధి చేకూర్చేలా భూకేటాయింపులంటూ ఆరోపణలు
- జీవోలు, టెండర్లు, భూకేటాయింపులపై ప్రశ్నలు
- ప్రభుత్వంపై న్యాయ, రాజకీయ పోరాటం ఉధృతం చేస్తామని సంకేతాలు

2



## రూ.250 కోట్ల విలువైన భూమి రూ.7కోట్లకే..

- సీఎం తన తమ్ముడికి ఇంత తక్కువ ధరకు ఎట్లా కేటాయిస్తారు?
- భూ కేటాయింపు వివరాలు ప్రజలముందుంచాలి
- ఈ భూ దందాపై బీజేపీ ఎందుకు ప్రశ్నించదు?
- ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణ

2



## నీరున్నా పంటలను కాపాడలేని ప్రభుత్వం

- ఇది రేవంత్ తెచ్చిన కరువు
- రాష్ట్ర రైతుకు నీరు నిల్.. ఏపీకి ఫుల్
- ఇదీ ప్రభుత్వ నిర్వాకం
- నిప్పులు చెరిగిన హరీష్‌రావు

2



## గణేష్ నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదు

- సోషల్ మీడియాలో దుష్ప్రచారాలు నమ్మొద్దు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, సెప్టెంబర్ 10:

హైదరాబాద్ మహానగరంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలు, వ్యతిరేక ప్రచారా

మిగతా 3వ పేజీలో..

## వ్యవసాయానికి ఉచిత కరెంటు
# ఇక 7 గంటలే?!

- రేవంత్ సర్కారు అనధికార కోతలతో రైతన్నల విలవిల
- మూడు రోజులుగా అమల్లోకి అనధికార కోతలు
- వర్షాభావంతో బోరు బావులే నమ్ముకున్న రైతులు
- లక్షలాది ఎకరాల్లో ఎండుతున్న ఖరీఫ్ పంటలు

తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:

తెలంగాణలో అన్నదాతల పాలిట కరెంటు కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. గత నెల రోజులుగా వ్యవసాయ రంగానికి సరఫరా అయ్యే విద్యుత్‌పై అంచెలవారీగా కోతలు విధిస్తున్న అధికారులు, తాజాగా రోజుకు కేవలం 7 గంటలు మాత్రమే విద్యుత్ పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

మిగతా 2వ పేజీలో..



## రూ.కోటి బీమా..
# దేశంలోనే తొలిగా

- ప్రభుత్వం, ఉద్యోగులపై రూపాయి భారం పడకుండా అమలు
- 12.91 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు వర్తింపు
- ఇప్పటికే 98 క్లెయిమ్‌ల పరిష్కారం
- ఉద్యోగుల కోసం హెల్త్‌కార్డు కూడా తీసుకొచ్చాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

8



## నిధుల వినియోగానికి స్వేచ్ఛ అవసరం

- అందుకే పంచాయతీరాజ్ చట్టం-2018కు సవరణ
- అసెంబ్లీలో ప్రవేశపెట్టిన మంత్రి సీతక్క

3

## ఇందిరమ్మ ఇళ్లు ..
## పేదల ఆత్మగౌరవానికి తగినట్టు

3



- ఏ నియోజకవర్గంలోని పేదలకు ఆ నియోజకవర్గంలోనే
- ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో మంత్రి పొంగులేటి స్పష్టీకరణ



## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8,591 కోట్లు

3

- శాసనమండలిలో మంత్రి అడ్లూరి

## హాస్పిటల్స్‌లో మౌలిక వసతుల పెంపునకు చర్యలు

3

- శాసనమండలిలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ వెల్లడి

## త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు

- రవాణశాఖ మంత్రి పొన్నం వెల్లడి

3

# ఫ్యూచర్ సిటీపై గులాబీ దండయాత్ర

**హైదరాబాద్, సెప్టెంబర్ 10:**
శాసనసభ నుంచి సస్పెన్షన్‌కు గురైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై పోరాటాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులో భారీ భూకేటాయింపులు జరిగాయని, వాటి ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రయోజనం చేకూరేలా వ్యవహరించారని బీఆర్ఎస్ ఆరోపించింది. ఈ నేపథ్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలోని బృందం రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ, రావిర్యాల ప్రాంతాల్లో పర్యటించింది.

**టెస్సెరాక్ట్ భూముల పరిశీలన**
తుక్కుగూడలోని టెస్సెరాక్ట్ ఆవరణకు చేరుకున్న కేటీఆర్, హరీశ్‌రావు నేతృత్వంలోని సస్పెండెడ్ ఎమ్మెల్యేల బృందం అక్కడి భూములను పరిశీలించింది. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డికి ప్రయోజనం చేకూర్చేలా వేలాది కోట్ల విలువైన భూములను ప్రభుత్వం కేటాయించిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. అసెంబ్లీలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా సస్పెండ్ చేసినా, ప్రజల తరపున క్షేత్రస్థాయిలో భూకేటాయింపుల వ్యవహారాలను బయటపెడతామని తెలిపారు.

**భూకేటాయింపులపై ప్రశ్నలు**
ఫ్యూచర్ సిటీ, తుక్కుగూడ, రావిర్యాల పరిధిలో ప్రభుత్వం జారీ చేసిన జీవోలు, టెండర్లు, భూకేటాయింపుల ప్రక్రియపై బీఆర్ఎస్ నేతలు ప్రశ్నలు సంధించారు. ప్రజా ప్రయోజనాల పేరుతో రైతుల భూములను స్వాధీనం చేసుకుని సీఎం కుటుంబానికి చెందిన సంస్థలు, కంపెనీలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రియల్ ఎస్టేట్ వ్యవహారాలు ఏ స్థాయికి చేరాయో తుక్కుగూడ, రావిర్యాల భూకేటాయింపులు వెల్లడిస్తున్నాయని విమర్శించారు.

**పోలీసులతో వాగ్వాదం**
బీఆర్ఎస్ నేతల పర్యటనతో రావిర్యాల, ఫ్యూచర్ సిటీ పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది. సస్పెండెడ్ ఎమ్మెల్యేలు, పార్టీ కార్యకర్తలను అడ్డుకునేందుకు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ నేతలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పార్టీ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశాయి.అసెంబ్లీలో సస్పెన్షన్‌కు గురైన తమ పోరాటాన్ని ప్రజాక్షేత్రంలో కొనసాగిస్తామని కేటీఆర్, హరీశ్‌రావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, రేవంత్‌రెడ్డి కుటుంబంపై వస్తున్న భూకేటాయింపుల ఆరోపణలపై న్యాయపరంగా, రాజకీయంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. దీంతో ఫ్యూచర్ సిటీ భూకేటాయింపుల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మరింత వేడి పెంచే అంశంగా మారింది..

# రూ.250 కోట్ల విలువైన భూమి రూ.7కోట్లకే ..

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :**
ముఖ్యమంత్రి సోదరుడు అనుముల కొండల్‌రెడ్డికి సుమారు రూ.250 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కేవలం రూ.7 కోట్లకే కేటాయించారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ భూమిని మార్కెట్ విలువకు కాకుండా ఇంత తక్కువ ధరకు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. కేటీఆర్ నేతృత్వంలో మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నాయకులు తుక్కుగూడకు గురువారం చేరుకుని భూమిని పరిశీలించారు. సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు కూడా ఉన్నారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఈ భూకేటాయింపుపై ప్రభుత్వం పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ భూములు, రాయితీలు, మినహాయింపులు ఇవ్వడం అధికార దుర్వినియోగం కాదా? ప్రయోజనాల సంఘర్షణ కాదా? కుటుంబ పాలన కాదా? అని నిలదీశారు. మరోవైపు అనుముల జగదీశ్వర్‌రెడ్డికి సంబంధించిన సంస్థకు రూ.1,000 కోట్ల పెట్టుబడి పేరుతో ప్రభుత్వ రాయితీలు, భూములు, మినహాయింపులు కల్పించే వ్యవహారంపైనా కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. ఒకవైపు గ్రేట్ ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి.. మరోవైపు గ్రేట్ పారిశ్రామికవేత్త అనుముల జగదీశ్వర్‌రెడ్డి. ఇద్దరి మధ్య రూ.1,000 కోట్ల పెట్టుబడి ఒప్పందం. దానికి మళ్లీ ప్రభుత్వ రాయితీలు, ప్రభుత్వ భూములు, మినహాయింపులు ఇవ్వాలా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి సోదరుడి సంస్థ ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌తో చేసుకున్న ఒప్పందంపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రూ.250 కోట్ల విలువైన భూమిని రూ.7 కోట్లకే కేటాయించిన వ్యవహారంపై బీజేపీ, కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఈడీ, ఐటీ, సీబీఐలు తమ మీద కేసులు పెట్టడానికే ఉన్నాయా.. అధికారంలో ఉన్నవారి వ్యవహారాలు ఎందుకు కనిపించడం లేదు అని నిలదీశారు. తెలంగాణ కాంగ్రెస్‌కు ఏటీఎంగా మారిందని ప్రధాని, కేంద్ర హోంమంత్రి ఆరోపిస్తున్నారని కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ ఏటీఎంగా మారిందని ప్రధాని చెబుతున్నారు.. మరి తెలంగాణను కొల్లగొడుతున్నారని మీరు ఆరోపిస్తున్నప్పుడు దొంగలను పట్టుకోవాల్సిన హోంమంత్రి ఎక్కడున్నారు.. ఇంత పెద్ద వ్యవహారం జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు అని ప్రశ్నించారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలు కేంద్ర ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలకు లోబడి ఉంటాయని కేటీఆర్ అన్నారు. ఈ రంగంలోనూ అధికారానికి దగ్గరగా ఉన్న కుటుంబాలకు ప్రయోజనాలు కల్పిస్తున్నారన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి కుటుంబానికి చెందిన సంస్థల




తోపాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి చెందిన సంస్థలు కూడా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలోకి రావడంపై పూర్తి వివరాలు వెల్లడించాలని కోరారు. శాసనసభలో ఈ భూ కేటాయింపులు, ఫ్యూచర్ సిటీ, ప్రభుత్వ విధానాలపై ప్రశ్నిస్తామనే తమను సస్పెండ్ చే శారని కేటీఆర్ అన్నారు. 'శాసనసభలో మా గొంతు నొక్కారు.. మీ దోపిడీని సభలో బయటపెడతామనే భయంతో మమ్మల్ని మెడపట్టి బయటకు పంపారు.. అందుకే మీ తమ్ముడికి ఇచ్చిన భూమి వద్దకే వచ్చాం.. ఇక్కడి నుంచే ప్రజల తరపున ప్రశ్నిస్తున్నాం' అని అన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ మాయాజాలం నడుపుతున్నదని కేటీఆర్ ఆరోపించారు. గతంలో ఫార్మాసిటీ కోసం నిర్దిష్ట షరతులతో భూసేకరణ జరిగిందని, ఆ భూములను ఇప్పుడు ఇతర కార్యకలాపాలకు వినియోగించడం చట్టపరంగా ప్రశ్నార్థకమని అన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో పెట్టుబడులు పెడుతున్న పారిశ్రామికవేత్తలు ఈ న్యాయపరమైన అంశాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఫ్యూచర్ సిటీ భవిష్యత్తుపై న్యాయపరమైన చిక్కులు ఉన్నాయి.. రేపు కోర్టులో ఈ భూములపై వివాదాలు తలెత్తితే నష్టపోయేది పెట్టుబడులు పెట్టిన పారిశ్రామికవేత్తలే. రేవంత్‌రెడ్డి కుటుంబ ప్రయోజనాల కోసం జరుగుతున్న రియల్ ఎస్టేట్ మాయాజాలంలో పెట్టుబడిదారులు బలిపశువులు కావద్దు అని కేటీఆర్ హెచ్చరించారు. ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తే సామాన్యులు, యువత, రైతులకు కూడా ఇదే తరహాలో ప్రభుత్వ భూములు, రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాము రూ.లక్ష మూలధనంతో పెట్టుబడి పెడతామని వస్తే రూ.200 కోట్ల విలువైన స్థలం ఇస్తారా.. మాకూ అదే రాయితీలు, మినహాయింపులు ఇస్తారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలిపెట్టబోమని కేటీఆర్ స్పష్టం చేశారు. అవసరమైతే ప్రజా కోర్టును ఆశ్రయిస్తామని, రంగారెడ్డి జిల్లాలోని ప్రతి గ్రామంలో సదస్సులు నిర్వహించి భూకేటాయింపులు, ఫ్యూచర్ సిటీ పేరుతో జరుగుతున్న వ్యవహారాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. అవసరమైన అన్ని న్యాయ, ప్రజాస్వామ్య మార్గాలను అన్వేషించి పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని చెప్పారు.

# రూ.80 కోట్లు ఆదా చేస్తామన్నా మాట వినలేదు!

**మొదటిపేజీ తరువాయి**

కేవలం ఆరు నెలల అవుట్‌సోర్సింగ్ వేతనాల కోసమే రూ.34.50 కోట్లు చూపించి, అధిక రేట్లకు టెండర్లను ఖరారు చేయడం వెనుక భారీ స్థాయిలో కమీషన్ల చేతులు మారాయన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

**ఐఏఎస్ అధికారి చక్రం**

వైటీపీఎస్ టెండర్ నిబంధనల ప్రకారం కోల్, యాష్ ప్లాంట్ల కోసం మొత్తం 1,650 మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బంది అవసరమని పేర్కొన్నారు. ఇందులో 151 మంది ఇంజనీర్లు కాగా, ఇప్పటికే జెన్‌కోలో 77 మంది విధుల్లో ఉన్నారు. అలాగే 1,499 మంది ఓఅండ్ఎం సిబ్బంది అవసరం కాగా, సంస్థలో 1,177 మంది సిబ్బంది అందుబాటులో ఉన్నారు. అంటే టెండర్ ప్రకారం కాంట్రాక్టర్ సమకూర్చాల్సింది కేవలం 396 మంది సిబ్బందిని మాత్రమే. కానీ రాష్ట్ర ప్రభుత్వంలోని ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి ఆదేశాల మేరకు, సంస్థలో ఇప్పటికే ఉన్న 1,254 మంది సిబ్బందిని ఉద్దేశపూర్వకంగా విస్మరించి.. మొత్తం 1,650 మందిని కొత్తగా ప్రైవేటు ఏజెన్సీ నుంచే నియమించేలా నిబంధనలు రూపొందించడం వెనుక ఉన్న మతలబు ఏమిటని కార్మిక సంఘాలు నిలదీస్తున్నాయి.

**కోల్, యాష్ క్లబ్బింగ్ మాయాజాలం..**

కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చేందుకు జెన్‌కో యాజమాన్యం సాంకేతిక ఎత్తుగడలు వేసింది. సాధారణంగా కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్, యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల నిర్వహణ పనులను వేర్వేరుగా టెండర్లు పిలిస్తే పోటీ పెరిగి సంస్థకు ఖర్చు భారీగా తగ్గుతుంది. కానీ ఎక్కువ వ్యయమయ్యే యాష్ నిర్వహణను, తక్కువ వ్యయమయ్యే కోల్ ప్లాంట్‌తో కలిపి ఒకే ప్యాకేజీగా మార్చారు. ఇలా క్లబ్బింగ్ చేయడం ద్వారా ఓవరాల్ రేట్లను కృత్రిమంగా పెంచి సదరు కాంట్రాక్టర్‌కు రూ. కోట్ల లాభం చేకూరేలా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. పనుల్లో పారదర్శకతను గాలికొదిలేసి కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకే అధికారులు ప్రాధాన్యతనిచ్చారని తేటతెల్లమవుతోంది.

**8 వేల లోపాలు పెండింగ్..**

నల్గొండ జిల్లా దామరచర్ల కేంద్రంగా 4 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం నిర్మిస్తున్న వైటీపీఎస్‌లో క్షేత్రస్థాయి పరిస్థితులు దయనీయంగా ఉన్నాయి. మొత్తం 5 యూనిట్లలో 4 యూనిట్లు ఇప్పటికే పూర్తయ్యాయని యాజమాన్యం రికార్డుల్లో ఘనంగా చెప్పుకుంటున్నప్పటికీ, ప్రాజెక్టు నిర్మించిన నిర్మాణ సంస్థ ఇంకా పూర్తిస్థాయిలో ఆపరేషన్ పనులను జెన్‌కోకు అప్పగించలేదు. దాదాపు 8,000 సాంకేతిక లోపాలు, సమస్యలను నిర్మాణ సంస్థ ఇంకా సరిదిద్దాల్సి ఉంది. ఒక యూనిట్ ప్రారంభమైన తొలి ఏడాది అనేక ఆపరేషనల్ సమస్యలు ఎదురవుతుంటాయి. అలాంటి పరిస్థితుల్లో సాంకేతిక లోపాలను సరిచేయకుండా, ఆదరాబాదరాగా నిర్వహణను ప్రైవేటు సంస్థకు అప్పగించడం వల్ల విద్యుత్ ఉత్పత్తికే తీవ్ర విఘాతం కలిగే ప్రమాదముంది.



**నేడు జెన్‌కో సీఈల ఘెరావ్.. సమరానికి సిద్ధమైన సంఘాలు**
ఉద్యోగులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రూ.80 కోట్లు ఆదా చేసి చూపిస్తామని మొరపెట్టుకున్నా బేఖాతరు చేస్తూ టెండర్లు ఖరారు చేయడంపై విద్యుత్ ఉద్యోగ సంఘాలు భగ్గుమన్నాయి. గురువారం అర్ధరాత్రి వరకు అత్యవసర సమావేశాలు నిర్వహించిన జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు, శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాజెక్టుల్లోని జెన్‌కో చీఫ్ ఇంజనీర్ల కార్యాలయాలను ముట్టడించి ఘెరావ్ చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాధనాన్ని లూటీ చేస్తూ ఖరారు చేసిన వైటీపీఎస్ ప్రైవేటు టెండర్లను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని, లేనిపక్షంలో థర్మల్ పవర్ స్టేషన్లలో విద్యుత్ ఉత్పత్తిని స్తంభింపజేసి సమ్మెకు దిగుతామని ఉద్యోగ సంఘాలు హెచ్చరించాయి.





# వ్యవసాయానికి ఉచిత కరెంటు ఇక 7 గంటలే?!

- **ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకే సరఫరా**
- **నిన్న యూరియా కష్టాలు.. నేడు కరెంటు తిప్పలు**
- **సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీకి విలువేదీ?**
- **పొలాల వద్దే రైతుల నిరసనలు, పడిగాపులు**



**మొదటిపేజీ తరువాయి**

రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి అధికారిక ప్రకటన లేకుండానే ఈ అనధికారిక నిర్ణయాన్ని గుట్టుచప్పుడు కాకుండా అమల్లోకి తెచ్చారు. గతంలో 18 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ అందించిన చోట, ఉన్నపళంగా సరఫరాను 7 గంటలకే కుదించడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలు మొహం చాటేసి, సరైన వర్షాలు లేక కేవలం భూగర్భ జలాలు, బోరుబావుల ఆధారంగానే పంటలు సాగు చేసుకుంటున్న అన్నదాతలకు ఈ ఆకస్మిక విద్యుత్ కోత పెను శాపంగా మారింది.

**మూడు రోజులుగా పొలాల్లోనే పడిగాపులు..**

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్, లభ్యత పరిస్థితులను సాకుగా చూపి వ్యవసాయానికి కేవలం 7 గంటల పాటు త్రీ ఫేజ్ సరఫరా చేస్తుండటంతో క్షేత్రస్థాయిలో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పంట ఎదుగుదల దశలో ఉన్న ఈ కీలక సమయంలో నీరందక లక్షలాది ఎకరాల్లో సాగైన ఖరీఫ్ పంటలు కళ్లముందే ఎండిపోయే దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం కేవలం సౌర విద్యుత్ ఉత్పత్తి అయ్యే సమయానికే సరఫరాను పరిమితం చేస్తూ, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య మాత్రమే కరెంట్ ఇస్తోంది. అయితే ఇందులోనూ లైన్ క్లియరెన్స్‌ల పేరుతో గంటల తరబడి కోతలు, పదే పదే వచ్చే అంతరాయాలతో క్షేత్రస్థాయిలో రైతుకు దక్కేది రోజుకు కనీసం 5 గంటలు కూడా లేదని అన్నదాతలు లబోదిబోమంటున్నారు. పంటలను బతికించుకునేందుకు రైతులు తిండితిప్పలు మాని ఎండలోనే మోటార్ల వద్దే పడిగాపులు కాయాల్సి వస్తోంది.

**ఇదేనా 24 గంటల ఉచిత పాలన?**

అధికారంలోకి వస్తే వ్యవసాయ రంగానికి నాణ్యమైన 24 గంటల ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందిస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికార పగ్గాలు చేపట్టాక రైతులకు ఇచ్చిన మాటను గాలికొదిలేసిందని రైతాంగం మండిపడుతోంది. ఉచిత విద్యుత్ అంటే రోజుకు కేవలం 7 గంటలు మాత్రమేనా అని ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. ఎన్నికల్లో గెలవడానికి అడ్డగోలు వాగ్దానాలు చేసి, గద్దెనెక్కాక ఒక్కొక్కటిగా పథకాలకు కోతలు విధిస్తూ రైతుల మెడకు ఉరితాళ్లు బిగిస్తున్నారని కర్షకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంటలు చేతికందే సమయంలో ఇలాంటి నిరంకుశ నిర్ణయాలు తీసుకోవడం ముమ్మాటికీ రైతాంగాన్ని నట్టేట ముంచడమేనని రైతు సంఘాలు ధ్వజమెత్తుతున్నాయి.

**నిన్న యూరియా కోసం.. నేడు కరెంటు కోసం..**

ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచే అన్నదాతల పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టుగా తయారైంది. పంట నాట్లు వేసిన నాటి నుంచి నేటి వరకు యూరియా, ఎరువుల బస్తాల కోసం మండల కేంద్రాల్లో రాత్రింబవళ్లు పడిగాపులు కాశారు. ఆఖరికి వందల కిలోమీటర్ల దూరం ఇతర ప్రాంతాలకు వెళ్లి అధిక ధరలకు యూరియాను కొనుగోలు చేసుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత పంటలను చీడపీడల నుంచి కాపాడుకునేందుకు వేల రూపాయలు అప్పులు చేసి పురుగుల మందులు పిచికారీ చేశారు. ఇప్పుడు పంట నెలరోజుల్లో చివరి దశకు వచ్చి చేతికి పంట అందే సమయంలో విద్యుత్ కోతలు విధించి రైతుల కడుపు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడు గంటల కరెంటును సైతం భవిష్యత్తులో మరింత తగ్గిస్తారేమోనన్న భయాందోళనలు అన్నదాతలను నిద్రలేకుండా చేస్తున్నాయి.

**సీఎం హామీ ఏమైంది?**

మూడు నెలల క్రితమే కాంగ్రెస్ ప్రభుత్వం 24 గంటల విద్యుత్ హామీని తుంగలో తొక్కిందంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్ చేసిన విమర్శలను స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తమ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, రైతులకు నిరంతరాయంగా 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చి తీరుతామని, ఈ ఉచిత కరెంట్‌తో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఉనికి లేకుండా చేస్తామని బీరాలు పలికారు. కానీ సాక్షాత్తు ముఖ్యమంత్రి చెప్పి మూడు నెలలు కూడా గడవకముందే వ్యవసాయ విద్యుత్‌ను 7 గంటలకు పరిమితం చేయడమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రి మాటలకే విద్యుత్ శాఖలో విలువ లేకుండా పోయిందా లేక ప్రభుత్వమే రైతులకు ఉద్దేశపూర్వకంగా కరెంట్ ఎగవేస్తోందా అని గ్రామీణ ప్రాంతాల్లో తీవ్రస్థాయిలో చర్చ సాగుతోంది. ప్రభుత్వ తీరుతో అన్నదాతలు తీవ్ర ఆగ్రహావేశాలకు లోనవుతున్నారు. వెంటనే ఈ అనధికార 7 గంటల విద్యుత్ కోతలను ఎత్తివేసి, గతంలో మాదిరిగానే వ్యవసాయ రంగానికి నిరంతరాయంగా పూర్తిస్థాయి ఉచిత విద్యుత్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో వేలాది మంది రైతులు సబ్‌స్టేషన్లను ముట్టడించి, రోడ్లపై బైఠాయించి ఉద్యమబాట పడతామని హెచ్చరిస్తున్నారు.

# నీరున్నా పంటలను కాపాడలేని ప్రభుత్వం

**హైదరాబాద్, సెప్టెంబర్ 10:**
కండ్ల ముందు నీళ్లు పారుతున్నా పొలాలకు నీళ్లు ఇవ్వలేని పాలన. పంటలను కాపాడలేని పరిస్థితి. ఇది కాలం తెచ్చిన కరువు కాదు రేవంత్ రెడ్డి తెచ్చిన కరవు అని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలమూరు బిడ్డను అని విర్రవీగే ఈ రేవంత్ రెడ్డి కృష్ణా జలాలు ఎత్తకుండా పాలమూరు ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నడన్నారు. రాష్ట్ర రైతాంగానికి నీళ్లు నిల్లు.. ఏపీ రైతాంగానికి నీళ్లు ఫుల్లు అని ఆరోపించారు. ఎల్ నినో ప్రమాదం ఉందని ప్రపంచ వాతావరణ సంస్థలు చెబుతున్నప్పుడు వచ్చిన నీళ్లు వచ్చినట్లు ఎత్తకుండా చోద్యం చూస్తున్నాడన్నారు. ఎత్తగలిగే అవకాశం ఉండి మోటార్లు బంద్ పెట్టి కూర్చున్నడని ఆరోపించారు. తెలంగాణ తెచ్చిన పార్టీగా తమకు బాధ్యత ఉందన్నారు. రేవంత్ రెడ్డికి తన గురువు బాగుంటే చాలు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం మొదటి పంప్ హౌజ్ ఎల్లూరు పంప్ హౌజ్ కేవలం రెండు మోటార్లు నడుస్తున్నాయి. మిగతా ఎందుకు బంద్ పెట్టావు.. ఆ రెండు కూడా ఆన్ అండ్ ఆఫ్ లో నడుస్తున్నాయి. సగటున 11 గంటలే మోటార్లు నడుపుతున్నారు. 24 గంటలు 5 మోటార్లు నడపాలి కానీ లేదు. రోజుకు 1600 క్యూసెక్కులు రావాల్సిన చోట 700 క్యూసెక్కులే వస్తున్నాయి. 4000 క్యూసెక్కులు ఎత్త గలిగే కెపాసిటీ ఉంటే రేవంత్ రెడ్డి ఎత్తుతున్నది 700 క్యూసెక్కులు. నీ ప్రాంతం మీద నీకున్న ప్రేమ వట్టి మాటలే. బాబుకి గురు దక్షిణ చెల్లించుకుంటున్నవా.. వెలిగొండ, పోతిరెడ్డి పాడు ద్వారా నీళ్లు తరలించుకుపోయేందుకు సహకరిస్తున్నవా అని ఆయన ప్రశ్నించారు. బీమా ప్రాజెక్టులో మూడు మోటార్లు ఉంటే ఒకటి నడుపుతున్నారు.. బేసిన్ తో సంబంధం లేని వెలిగొండ ద్వారా చంద్రబాబు నీళ్లు తీసుకుపోతుంటే బేసిన్ లో ఉండి, నికర జలాల కేటాయింపు ఉన్న బీమా ఎందుకు నడపట్టేదని హరీష్‌రావు ప్రశ్నించారు. నెట్టంపాడులో నాలుగు ఉంటే ఒకటి, కోయిల్ సాగర్ లో మూడు



ఉంటే ఒకటి నడుపుతున్నరు. నీళ్లు ఉండి మోటార్లు నడపడం చేతగాని ముఖ్యమంత్రిని నిన్నే చూస్తున్న. అసెంబ్లీలో తాము ప్రజల తరపున మాట్లాడితే మార్షల్స్ పెట్టి మమ్మల్ని ఎత్తేసావు. మమ్మల్ని కాదు మోటార్లు ఆన్ చేసి కృష్ణా నీళ్లు ఎత్తు. రేవంత్ నిర్లక్ష్యం వల్ల తెలంగాణ వరప్రదాయిని అయిన కృష్ణా నీళ్లు ఏపీకి వరప్రదాయినిగా మారాయన్నారు. పాలమూరు, నల్లగొండ జిల్లాలకు నీళ్లు రాక ఇబ్బందులు పడుతున్నారు.. సాగు, తాగు నీళ్ల కోసం తండ్లాడుతున్నారు.. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో రైతులు అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్నరు.. పొంగులేటి నియోజకవర్గంలో రైతులు ధర్నాలు చేస్తున్నరు.. రాష్ట్రవ్యాప్తంగా సబ్ స్టేషన్ల ముందు రైతులు ధర్నా చేస్తున్నరు అని తెలిపారు. రోమ్ తగలబడుతుంటే ఫిడేల్ వాయించినట్లు సస్పెన్షన్ల బిజీలో ఉన్నడు అని హరీష్‌రావు ఘాటుగా విమర్శించారు. నీళ్లు ఉండి నీళ్లు ఎత్తరు, ఉత్పత్తి కెపాసిటీ ఉండి కరెంట్ ఉత్పత్తి చేయడం లేదు. కేటీపీఎస్ 800 మెగావాట్ల ప్లాంటు మూసేసారు. 540 మెగావాట్ల బీటీపీఎస్ యూనిట్ 3,4 ప్లాంట్లు మూసేసారు. యాదాద్రిలో 4000 మెగావాట్లకు ఉత్పత్తి చేస్తున్నది. 2000 మెగావాట్లు ఒకవైపు బొగ్గు సర్ ప్లస్ ఉంది అంటున్నరు. మరోవైపు యాదాద్రి ప్లాంటుకు బొగ్గు సరఫరా చేయడం లేదన్నారు. కొండారెడ్డిపల్లిలో ధర్నా చేస్తున్న రైతులు, పొంగులేటి నియోజకవర్గంలో చేస్తున్న రైతులు బిఆర్ఎస్ కార్యకర్తలా అని ప్రశ్నించారు.

# హాస్పిటల్స్‌లో మౌలిక వసతుల పెంపునకు చర్యలు

- మరో 9 హాస్పిటల్స్‌లో ఎంఆర్ఐ సేవలు
- 8 హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ సేవలు
- అదనంగా 485 వెంటిలేటర్ల ఏర్పాటు
- శాసనమండలిలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :**



ప్రభుత్వ హాస్పిటళ్లలో ఎంఆర్ఐ, సీటీ స్కాన్ సేవలను మరింత విస్తరిస్తున్నామని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. కొత్తగా 9 ఎంఆర్ఐ యంత్రాలు, 8 సీటీ స్కాన్ యంత్రాలను ప్రభుత్వ హాస్పిటళ్లలో ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అదనంగా 485 వెంటిలేటర్లను కూడా కొనుగోలు చేసి అవసరమైన హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. శాసన మండలిలో ఎమ్మెల్సీలు గురువారం అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ప్రస్తుతం గాంధీ, ఉస్మానియా, నిమ్స్, వరంగల్ ఎంజీఎం, ఆదిలాబాద్ రిమ్స్, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్, ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్‌లో తొమ్మిది ఎంఆర్ఐలు, 50 సీటీ స్కాన్ యంత్రాలు, 1,770 వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొత్తగా నిజామాబాద్ జీజీహెచ్, సిద్దిపేట జీజీహెచ్, సూర్యాపేట జీజీహెచ్, నల్గొండ జీజీహెచ్, మహబూబ్‌నగర్ జీజీహెచ్, నీలోఫర్ తదితర హాస్పిటల్స్‌లో ఎంఆర్ఐ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. గాంధీ, ఉస్మానియాల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తుండడంతో అక్కడికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో అక్కడ అదనపు ఎంఆర్ఐ యంత్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మొత్తంగా తొమ్మిది అత్యాధునిక టెక్నాలజీతో కూడిన 3టెస్లా ఎంఆర్ఐ యంత్రాలను కొనుగోలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం 50 ప్రభుత్వ హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ సేవలు అందుబాటులో ఉన్నాయని, కొత్తగా మరో 8 హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ యంత్రాలను ఏర్పాటు చేయనున్నామని మంత్రి తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ప్రస్తుతం 1,770 వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయని, అవసరమైనచోట అదనంగా 485 వెంటిలేటర్లను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు.

**వైద్య పరికరాల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థ**

వైద్య పరికరాలను కొనుగోలు చేయడం మాత్రమే కాక అవి నిరంతరం పనిచేసేలా చూడటానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. వైద్య పరికరాల కొనుగోలు, సరఫరా, నిర్వహణకు సంబంధించిన వివరాలను పర్యవేక్షించేందుకు ఈఉపకరణ్ అనే వెబ్ ఆధారిత పరికరాల జాబితా, నిర్వహణ వ్యవస్థను వినియోగిస్తున్నామని తెలిపారు. వైద్య పరికరాల పనితీరు, నిర్వహణ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు టీజీఎంఎస్ఐడీసీలో ప్రత్యేక ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ (పీఎంయూ) ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. పీఎంయూ ద్వారా పరికరాలను క్రమం తప్పకుండా ఆడిట్ చేసి వాటి పనితీరు, వర్కింగ్ కండీషన్, నిర్వహణ పరిస్థితిని పర్యవేక్షిస్తూ, అవసరమైన సమయంలో సర్వీసింగ్, రిపేర్లు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రిపేర్లు తక్షణమే జరిగేలా. బయోమెడికల్ ఇంజనీర్లను నియమిస్తున్నామని మంత్రి తెలిపారు. వైద్య పరికరాలు నిరంతరం పనిచేయాలంటే శిక్షణ పొందిన టెక్నీషియన్లు కీలకమని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో గత రెండున్నరేళ్లలో 1,500 మందికి పైగా టెక్నీషియన్లను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించామని వెల్లడించారు. అవసరమైనచోట కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో టెక్నీషియన్లను నియమిస్తున్నామని మంత్రి తెలిపారు.

**నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం**

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని(ఈహెచ్ఎస్) అమలు చేస్తున్నామని మంత్రి దామోదర్ తెలిపారు. 2026 జూలై 17 నుంచి ఈ పథకం అమల్లోకి వచ్చిందని మంత్రి తెలిపారు. చీఫ్ సెక్రటరీ అధ్యక్షతన నూతన ఈహెచ్ఎస్ ట్రస్ట్(ఈహెచ్‌సీటీ) ఏర్పాటు చేశామని చెప్పారు. 30 మంది సభ్యులతో ఉన్న ఈ ట్రస్టులో ఉద్యోగ సంఘాల నుంచి 10 మంది, పెన్షనర్ సంఘాల నుంచి ముగ్గురు, ప్రభుత్వం నుంచి 16 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లు తమ బేసిక్ పే/చివరగా పొందిన పెన్షన్‌లో 1.5 శాతం చొప్పున నెలకు చెల్లిస్తుండగా అంతే మొత్తాన్ని ప్రభుత్వం కూడా ఇస్తోందని మంత్రి తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి నెలకు రూ.44 కోట్లు, ప్రభుత్వం నుంచి మరో రూ.44 కోట్లు కలిపి నెలకు రూ.88 కోట్లు సమకూరుతున్నాయని చెప్పారు. ఈ పథకానికి ఏడాదికి రూ.1,056 కోట్ల బడ్జెట్ ఉందని తెలిపారు. నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం కింద 921 దవాఖానల్లో ఇన్‌పేషెంట్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఇందులో 114 ప్రభుత్వ, 807 ప్రైవేట్ హాస్పిటల్స్ ఉన్నాయని చెప్పారు. పథకం ప్రారంభమైన తర్వాత ఇప్పటివరకు 8,511 కేసులకు రూ.55.14 కోట్ల ప్రీఆథరైజేషన్ ఇచ్చామని మంత్రి తెలిపారు. ఈ పథకం పరిధిలో 17 లక్షలకు పైగా లబ్ధిదారులు ఉన్నారని మంత్రి తెలిపారు. అర్హులైన వారికి డిజిటల్ ఆరోగ్య కార్డులను వెబ్ పోర్టల్ ద్వారా జారీ చేస్తున్నామని చెప్పారు. ఓటీపీ ద్వారా స్వయంగా హెల్త్ కార్డును డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. అందరికీ హెల్త్ కార్డులు ఇస్తామని, ఉద్యోగులు కోరుకున్న విధంగా ఆరోగ్య సేవలు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

**37 వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటు**

ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు ఓపీ వైద్యం, వైద్య పరీక్షలు, మందులు అందించేందుకు ప్రస్తుతం 12 జిల్లాల్లో 12 వెల్‌నెస్ కేంద్రాలు పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. మరో 25 వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ఇందులో 21 జిల్లాల్లో, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరిలో అధిక రద్దీ ఉన్న ప్రాంతాల్లో మరో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీంతో మొత్తం వెల్‌నెస్ కేంద్రాల సంఖ్య 37కు చేరుతుందని చెప్పారు.

# నిధుల వినియోగానికి స్వేచ్ఛ అవసరం

- అందుకే పంచాయతీరాజ్ చట్టం-2018కు సవరణ
- అసెంబ్లీలో ప్రవేశపెట్టిన మంత్రి సీతక్క
- ఏకగ్రీవంగా శాసన సభ ఆమోదం

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :**

గ్రామ పంచాయతీకి వచ్చే డబ్బు గ్రామాభివృద్ధికే ఉపయోగపడాలి.. ఆదాయం గ్రామ అవసరాలకు అందుబాటులో ఉండాలి.. నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాలి.. ప్రజలకు జవాబుదారీతనం ఉండాలి.. ఇదే ప్రజా ప్రభుత్వ విధానం అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. దేశంలో గ్రామీణ స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు 73వ రాజ్యాంగ సవరణ తీసుకొచ్చారు. గ్రామ పంచాయతీలు కేవలం ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేసే సంస్థలుగా కాక ప్రజలకు దగ్గరగా ఉండే స్వయం పాలనా సంస్థలుగా పనిచేయాలన్నదే దాని ప్రధాన ఉద్దేశం అని చెప్పారు. అయితే స్థానిక సంస్థలకు అధికారాలు, బాధ్యతలతోపాటు వాటికి అవసరమైన ఆర్థిక వనరులు కూడా ఉండాలన్నారు. పంచాయతీలకు కొన్ని పన్నులు, సుంకాలు, ఫీజులు వసూలు చేసుకునే అధికారాలను కూడా కల్పించారని చెప్పారు. రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల ఏర్పాటు, పారిశుద్ధ్యం నిర్వహణ, వీధి దీపాలు ఏర్పాటు, తాగునీటి సరఫరా వంటి అనేక ప్రాథమిక పౌర సేవల బాధ్యతలు ఉన్నాయి. జీపీలకు ఆదాయం సమకూర్చుకునే అధికారం ఇచ్చి ఆ ఆదాయాన్ని అవసరమైన సమయంలో వినియోగించుకునే స్వేచ్ఛ లేకపోతే స్థానిక స్వపరిపాలన ఎలా బలపడుతుంది అని మంత్రి ప్రశ్నించారు. ఇదే ప్రశ్నకు సమాధానంగా రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం2018లోని సెక్షన్ 70లోని సబ్ సెక్షన్ 3కు సవరణ చేస్తూ బిల్లును ప్రవేశపెడుతున్నామన్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీలు తమ సొంత ఆదాయ వనరుల ద్వారా సమకూర్చుకునే నిధులను ప్రభుత్వ ట్రెజరీ ఖాతాలో జమ చేయాల్సి వస్తోంది. ఆ తర్వాత ఆ నిధులను వినియోగించుకోవాలంటే ట్రెజరీ ద్వారా డ్రా చేసుకోవాలి. దీనికి ఒక నిర్దిష్టమైన ప్రక్రియ ఉంటుంది. దీని వల్ల కొన్నిసార్లు నిధుల వినియోగంలో ఆలస్యం జరుగుతోంది. గ్రామంలో సమస్య వస్తుంది.. కానీ దాన్ని పరిష్కరించడానికి అవసరమైన డబ్బు అందుబాటులోకి రావడానికి ఎందుకు ఆలస్యం కావాలి.. ఆ డబ్బును వినియోగించుకునే ప్రక్రియలో ఆలస్యం జరిగితే ప్రజలు ఇబ్బందులు పడతారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు బ్యాంకు ఖతాల్లో జమ అయినట్లుగానే జీపీ సొంత ఆదాయం కూడా బ్యాంకు ఖాతాలో జమ అయ్యేలా చట్టాన్ని సవరిస్తున్నాం అని మంత్రి చెప్పారు.

**గ్రామ సభ తీర్మానం మేరకు అవసరాలకు ఖర్చు చేసుకోవచ్చు**

మున్సిపాలిటీల్లో సొంత ఆదాయాన్ని బ్యాంకు ఖాతాల్లో వేసుకోవచ్చు.. కానీ పంచాయతీలకు ఆ వెసులుబాటు లేదు.. పంచాయతీల మీద గత ప్రభుత్వం వివక్ష చూపింది.. దాన్ని రూపుమాపడానికి చట్ట సవరణ చేస్తున్నాం.. గ్రామ సభ తీర్మానం మేరకు అవసరాలకు ఖర్చు చేసుకోవచ్చు. బీసీ రిజర్వేషన్ల కారణంగా పంచాయతీ ఎన్నికలు ఆలస్యం అయ్యాయి.. ఆ కాలానికి సంబంధించి కేంద్రం నుంచి నిధులు పూర్తి స్థాయిలో రాలేదు.. ప్రతి నెలా జీపీల కోసం రూ.50 కోట్లు వెచ్చిస్తున్నాం.. 202526 ఏడాదికి సంబధించి సెకండ్ ఇనస్టాల్‌మెంట్ రూ.619 కోట్లు రావాల్సి ఉంది.. మొదటి తేదీనే మల్టీ పర్పస్ వర్కర్లకు జీతాలు ఇస్తున్నాం.. కేంద్రం నూతన విధానాల కారణంగా గ్రామాల అభివృద్ధిపై ప్రభావం చూపుతోంది.. వీజీజీ రాంతో రాష్ట్రాలపై రూ. 2 వేల కోట్ల అదనపు భారం పడుతుంది.. అయినా తాము పెద్ద ఎత్తున వీబీ జీ రాంజీ పనులు చేయిస్తున్నాం.. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, పొలానికి పంట కుంట, ఊరికి ఊట కుంటను నిర్మిస్తున్నాం.. ప్రతి గ్రామానికి పక్కా రహదారి ఉండాలని సీఎం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారు. ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి డబుల్ రోడ్లు ఇస్తున్నాం. హ్యామ్ విధానంలో వేల కిలోమీటర్లు నిర్మిస్తున్నాం.. ఫారెస్టు ప్రాంతాల్లో కేంద్ర అటవీ చట్టాలు రోడ్ల నిర్మాణానికి అడ్డంకులు ఎదురవతున్నాయి.. దీంతో ప్రజల" ఇబ్బందులు పడుతున్నారు.. కేంద్ర ప్రభుత్వం నుంచి క్లియరెన్స్ ఇప్పించాలి అని అన్నారు. ఉప సర్పంచ్‌ల చెక్ పవర్‌పై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. బిల్లును అమోదించాలని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేయగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. శాసనమండలిలోనూ పంచాయతీరాజ్ సవరణ బిల్లుకు ఏకగ్రీవ ఆమోదం లభించింది.

# గణేష్ నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదు

**మొదటిపేజీ తరువాయి**



స్పందించారు. చెరువుల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా ఎప్పుడూ వ్యతిరేకం కాదని, తాము పునరుద్ధరణ పనులు చేపడుతున్న చెరువుల వద్ద నిమజ్జనాలకు ఎలాంటి ఆంక్షలు విధించలేదని స్పష్టం చేశారు. అసత్య ప్రచారాలను ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నోటిఫై చేసిన నాలుగైదు సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా బయోడైవర్సిటీగా గుర్తించిన అమీన్‌పూర్ చెరువు, నేచురల్ వెట్‌ల్యాండ్‌గా రక్షణ పొందిన కాప్రా చెరువులు ఇందులో ఉన్నాయని గుర్తు చేశారు. కాప్రా చెరువులో ప్రస్తుతం నీరు లేనందున అక్కడ ఎవరూ సమస్యలు సృష్టించవద్దని కోరారు. నగరంలోని మిగిలిన అన్ని చెరువులు, జలాశయాల్లో వినాయక నిమజ్జనాలు ఎప్పటిలాగే యథావిధిగా సాగుతాయన్నారు. ప్రధాన నీటి వనరులు, చెరువుల పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు, భక్తులు, ఉత్సవ కమిటీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు విస్తృతంగా బేబీ పాండ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హైడ్రా సుందరీకరిస్తున్న చెరువుల వద్ద ఎలాంటి నిషేధాలు లేవని, వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణహితంగా నిర్వహించుకునేలా భాగ్యనగర ప్రజలు, ఉత్సవ సమితి ప్రతినిధులు సహకరించాలని కోరారు.

# త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు

- మెట్రోతో మరో 50 బస్సులు అనుసంధానిస్తాం
- పీఎం ఈ-డ్రైవ్ కింద నగరానికి 2,200 బస్సులు
- రవాణశాఖ మంత్రి పొన్నం వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :**



గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీని మూసివేసే పరిస్థితి ఉండగా ఇప్పుడిప్పుడే గాడిన పడుతోందని రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శానససభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. పీఎం ఈడ్రైవ్ కింద హైదరాబాద్ నగరానికి 2,200 బస్సులు రాబోతున్నాయని తెలిపారు. ఆర్టీసీలో కార్మిక సంఘాల ఎన్నికలను గత ప్రభుత్వం రద్దు చేసిందని, ఎన్నికలపై సంఘాల నేతలతో చర్చలు జరుగుతున్నాయని, కార్మిక సంఘాల ఎన్నికల తర్వాత ఆర్టీసీ వీలీన ప్రక్రియ ఉంటుందని మంత్రి తెలిపారు. త్వరలో ఎన్నికల తేదీపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. కొత్త ఈవీ పాలసీ తీసుకొచ్చామని, హైదరాబాద్ నగరానికి 100 మినీ బస్సులు రాబోతున్నాయని, వాటిలో 50 పాత బస్తీకి, మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానిస్తాం అని తెలిపారు. 347.47 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం పొందగలిగారని, ఇది ఒక చరిత్ర అని తెలిపారు. ఆర్టీసీ ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాత కొత్త బస్టాండ్లు నిర్మిస్తామని చెప్పారు. బస్టాండ్ల అభివృద్ధికి ఆర్థికంగా ఎమ్మెల్యేలు సహకరించాలని కోరారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఆర్టీసీ స్థలం అందించామని చెప్పారు. ఆర్టీసీ విలీనమైన ఏపీలో అనేక సమస్యలు ఎదుర్కుంటున్నారని తెలిపారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8,591 కోట్లు

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :**



రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఆశ్రమ పాఠశాలల్లోని పోస్టుల అప్‌గ్రేడేషన్‌పై ఎస్సీ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శాసనమండలిలో గురువారం కీలక ప్రకటన చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు ఎమ్మెల్సీలు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన వివరంగా సమాధానమిచ్చారు. ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న, తక్కెళ్లపల్లి రవీందర్ రావు, సత్యం నెలికంటి అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిస్తూ.. 2025-26 విద్యా సంవత్సరం వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులకు సంబంధించి ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8,591.62 కోట్లుగా ఉన్నట్లు సభకు వెల్లడించారు. ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న పండిట్లు, వ్యాయామ ఉపాధ్యాయుల (పీఈటీ) పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేసే అంశంపై ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ ప్రతిపాదన ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, సాధ్యమైనంత త్వరగా దీనిపై తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల సంక్షేమంతో పాటు సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.

**సర్టిఫికెట్ల నిలిపివేత ఆరోపణలు అవాస్తవం**

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రాకపోవడంతో ప్రైవేటు కళాశాలలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఫీజులు వసూలు చేస్తున్నాయన్న సభ్యుల ఆరోపణలను మంత్రి తోసిపుచ్చారు. రాష్ట్రంలో అటువంటి పరిస్థితి లేదని స్పష్టం చేశారు. అక్రమ వసూళ్లు లేనందున, ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకునే ప్రశ్న ఉత్పన్నం కాదన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు .. పేదల ఆత్మగౌరవానికి తగినట్టు

- ఇళ్లకు రూ.5 లక్షల ఉచిత సాయం ఎక్కడా లేదు
- రెండో విడతలో 59 వేల గుడిసెల స్థానంలో ఇందిరమ్మ ఇళ్లు
- ఏ నియోజకవర్గంలోని పేదలకు ఆ నియోజకవర్గంలోనే
- ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో మంత్రి పొంగులేటి స్పష్టీకరణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :**

పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారు నివసించే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శాసనసభలో ఎమ్మెల్యేలు మనోహరరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మేడేపల్లి సత్యం, అక్బరుద్దీన్, వెంకట్రామిరెడ్డి తదితర సభ్యులు ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి గురువారం అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. పేదలను వారి జీవనోపాధికి దూరంగా 3040కి.మీ అవతలికి పంపించే విధానం తమ ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టం చేశారు. ఎకరం రూ.150200 కోట్లు విలువ చేసే ప్రాంతాల్లో కూడా పేదవాడి ఆత్మగౌరవానికి తగినట్లుగా ఇల్లు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. డ్రాలో ఎంపికైన ప్రతి లబ్దిదారుడిని అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. ఇతర నియోజకవర్గాలకు చెందిన వారు డ్రాలో ఎంపికైనట్లు తేలితే వారి పేర్లను తప్పనిసరిగా తొలగిస్తామని సభ సాక్షిగా స్పష్టం చేశారు. ప్రధానమైన సిమెంట్ ధరను పేదలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సిమెంట్ కంపెనీలతో చర్చలు జరిపామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో రూ.310320 ఉన్న 50 కేజీల సిమెంట్ బ్యాగ్‌ను రూ.230కే పేదలకు అందించేలా ఒప్పందం పూర్తి చేశామని, త్వరలో అమల్లోకి వస్తుందని చెప్పారు. స్టీల్‌ను కూడా తక్కువ ధరకు అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

**రూ.5 లక్షలు ఉచితంగా ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ**

దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఉచితంగా అందించిన ఉదాహరణ లేదని, తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.5 లక్షలు అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రూ.5 లక్షలు సరిపోవడం లేదని పలువురు సభ్యులు సూచించారని, ఆ అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని తెలిపారు.

**8 లక్షల ఇళ్లకు సుమారు రూ.40 వేల కోట్ల భారం**

మొదటి విడతలో మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.22,500 కోట్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.11 వేల కోట్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లకు సుమారు రూ.5,500 కోట్లు అవసరమవుతాయని మంత్రి వివరించారు. రెండు విడతల్లోనే సుమారు 8 లక్షల ఇళ్లకు రూ.40 వేల కోట్లకు పైగా రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులైన పేదలకు ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

**చిన్న లోపాలతో ఆగిన 3,200 ఇళ్లకు పరిష్కారం**

మొదటి విడతలో ప్రభుత్వ అనుమతులతో ఇళ్లు ప్రారంభించి నిర్మాణంలో చిన్నచిన్న లోపాల కారణంగా నిలిచిపోయిన సుమారు 3,200 ఇళ్లను రాటిఫై చేసి క్లియర్ చేశామని మంత్రి తెలిపారు. వారందరికీ ఈ వారం చివర్లోనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గతంలో రాజకీయ వివక్షతో ఇళ్ల కేటాయింపులు జరిగాయని విమర్శించిన మంత్రి తమ ప్రభుత్వం మాత్రం అర్హతే ప్రామాణికంగా ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు. ప్రతిపక్ష సభ్యులు సూచించిన అర్హులైన పేదల పేర్లను కూడా పరిశీలించి, అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఎక్కడైనా అర్హులైన పేదలకు అన్యాయం జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

**పాత ప్రభుత్వ స్థలాల్లో నెల రోజుల్లో పేదలకు ఇళ్ల స్థలాలు**

గతంలో ఉమ్మడి ఏపీలో పేదల కోసం గుర్తించిన ప్రభుత్వ స్థలాలు, సేకరించిన భూముల్లో ఇంకా కేటాయింపులు జరగని స్థలాలను గుర్తించి అర్హులైన పేదలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. నెల రోజుల్లోగా ఆయా నియోజకవర్గాల్లో అర్హులైన పేదలకు ఈ స్థలాలు అందించేలా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు.

**రాష్ట్రంలో 59 వేల గుడిసెలకు రెండో విడతలో ప్రాధాన్యత**

దశాబ్దాలుగా గుడిసెల్లోనే జీవిస్తున్న పేదలకు రెండో విడతలో శుభవార్త అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన సుమారు 59 వేల గుడిసెలను రెండో విడతలో ప్రాధాన్యతగా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలోని 20 నియోజకవర్గాల్లో పైలట్ మోడల్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో లాటరీ ద్వారా లబ్దిదారులను ఎంపిక చేశామని, వారి భౌతిక పరిశీలన పూర్తి చేసి తుది జాబితా సిద్ధం చేస్తున్నామని చెప్పారు. వచ్చే ఏడాది బోనాల పండుగ నాటికి హైదరాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్‌లో గృహ ప్రవేశాలు జరిగేలా కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు. హైదరాబాద్‌తోపాటు ఇతర కార్పొరేషన్లలోనూ ఇదే విధానాన్ని పైలట్ మోడ్‌లో అమలు చేస్తున్నామని, అవసరమైతే మున్సిపాలిటీల్లోనూ పరిశీలిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

**అసంపూర్తి 2బీహెచ్‌కేలకు రూ.750 కోట్ల చెల్లింపులు**

గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన 2బీహెచ్‌కే ఇళ్లను పూర్తి చేయడంతోపాటు మౌలిక వసతుల కల్పనకు ప్రజా ప్రభుత్వం రూ.600 కోట్లకు పైగా ఖర్చు చేసిందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా వదిలిన ఆ ఇళ్లకు సుమారు రూ.750 కోట్ల బిల్లులు చెల్లించామని చెప్పారు. గతంలో వివిధ కారణాలతో సొంత డబ్బులతో ఫౌండేషన్, గోడలు లేదా స్లాబ్ వరకు నిర్మించి ఆగిపోయిన ఇళ్లకు కూడా ఈసారి ప్రత్యేక అవకాశం కల్పించామని మంత్రి తెలిపారు. రెండో విడతలో ప్రతి 2,000 ఇళ్లలో 500 ఇళ్లను అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు కేటాయించే కొత్త విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు.

**డ్వాక్రా మహిళలకు రూ.లక్ష అడ్వాన్స్**

ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేని డ్వాక్రా మహిళా సంఘాల్లో సభ్యులైన పేదలకు రూ.లక్ష అడ్వాన్స్‌గా అందించే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. పేదలు గుడిసెల నుంచి స్లాబ్ వేసిన ఇందిరమ్మ ఇళ్లలోకి మారేలా ప్రజాప్రతినిధులు కూడా చొరవ తీసుకోవాలని కోరారు.

# కరెంటు కోతలతో మళ్లీ పాత రోజులు: కేటీఆర్

**మొదటిపేజీ తరువాయి**



విమర్శలు గుప్పించారు.

**సీఎం సొంత ఊరిలోనూ కరెంటు కోతలే..**

'కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు.. ఇదేనా కాంగ్రెస్ తెచ్చిన మార్పు?' అంటూ కేటీఆర్ వ్యంగ్యంగా ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి జిల్లాలోని ఆయన సొంత గ్రామంలోనూ రైతులు విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలు ఎండిపోతున్నాయని, మోటార్లు పనిచేయక సాగుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు.

**మళ్లీ పాత కష్టాలేనంటూ..**

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అన్నదాతలకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించామని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులు మళ్లీ విద్యుత్ కష్టాలను ఎదుర్కొంటున్నారని విమర్శించారు. సీఎం సొంత గ్రామంలోని పరిస్థితులే రాష్ట్రంలో విద్యుత్ సరఫరా తీరుకు నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు.

# చాకలి ఐలమ్మకు ఘన నివాళి



- కాకతీయనగర్‌లో డ్రైనేజీ సమస్యపై పుష్పనగేష్ దృష్టి..
- అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 10 (సిరి న్యూస్):**

చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకుని శ్రీనివాస్‌నగర్ కాలనీ సండే మార్కెట్ వద్ద ఉన్న ఆమె విగ్రహానికి తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ, రజక సంఘం నాయకులు నివాళులర్పించారు. తెలంగాణ ప్రజల తెగువ, పోరాట స్ఫూర్తిని చాటిన చాకలి ఐలమ్మ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని పుష్పనగేష్ అన్నారు. అనంతరం కాకతీయనగర్ కాలనీలో పర్యటించిన పుష్పనగేష్ స్థానిక సమస్యలను పరిశీలించారు. కొంతకాలంగా డ్రైనేజీ సమస్యతో కాలనీవాసులతో పాటు శ్రీరామాలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారని కాలనీ అధ్యక్షుడు అమృత సాగర్, కమిటీ సభ్యులు తెలిపారు. దీనిపై జలమండలి అధికారులతో మాట్లాడిన పుష్పనగేష్ సిబ్బందిని పంపించి సమస్యను పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. అవసరమైతే నూతన పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. అలాగే కాకతీయనగర్-శంకర్‌నగర్ బ్రిడ్జి వద్ద చెత్త డంపింగ్ సమస్యను స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా, పారిశుధ్య సూపర్‌వైజర్‌తో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.



# గీతంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం

**పటాన్ చెరు, సెప్టెంబర్ 10, (సిరి న్యూస్):**

హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌కు చెందిన అప్లైడ్ సైకాలజీ విభాగం, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, ఆత్మహత్యల నివారణపై బహిరంగ చర్చలను ప్రోత్సహించడం లక్ష్యంగా పలు కార్యక్రమాలతో సెప్టెంబర్ 10న ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పాటించింది. 'ఆత్మహత్యలపై కథనాన్ని మార్చడం', 'చర్చను ప్రారంభించండి' అనే ఇతివృత్తంతో, మానసిక ఆరోగ్యంపై నెలకొన్న మౌనాన్ని ఛేదించడం, అలాగే వ్యక్తులు సహాయం కోరడానికి సౌకర్యవంతంగా భావించే సహాయక వాతావరణాన్ని సృష్టించడం యొక్క ప్రాముఖ్యతను చాటి చెప్పారు. భావోద్వేగ శ్రేయస్సు, మానసిక ఆరోగ్య సవాళ్లు, మద్దతు, ఆశ, ఆత్మహత్యల నివారణ వంటి అంశాలను అన్వేషించే ప్రదర్శనలు, కళాకృతులు, ఇతర సృజనాత్మక వ్యక్తీకరణల ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. ఈ చొరవ గీతం సమాజాన్ని సంభాషణలు ప్రారంభించడానికి, కళంకాన్ని సవాలు చేయడానికి, భావోద్వేగ బాధలను అనుభవిస్తున్న వారి పట్ల సానుభూతి, అవగాహనను పెంపొందించడానికి ప్రోత్సహించింది. ఈ కార్యక్రమాల ద్వారా, అప్లైడ్ సైకాలజీ విభాగం ప్రాంగణం అంతటా మరింత అవగాహన కల్పించడానికి, శ్రద్ధ, అనుబంధం, మద్దతు సంస్కృతిని ప్రోత్సహించడానికి తన నిబద్ధతను పునరుద్ఘాటించింది.



# కాంగ్రెస్ పార్టీ మండల వైస్ ప్రెసిడెంట్ గా బలరాం శ్రీనివాస్

**సదాశివపేట. సెప్టెంబర్ 10. (సిరిన్యూస్)**

నూతనంగా ఏర్పాటు చేసిన కమిటీలలో భాగంగా బలరాం శ్రీనివాసు ను సదాశివపేట కాంగ్రెస్ పార్టీ మండల వైస్ ప్రెసిడెంట్ గా నియమించడం జరిగింది.

ఈ సందర్భంగా బలరాం శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచుకొని తనకు పదవి ఇవ్వడం చాలా సంతోషకరమని, పార్టీకి కట్టుబడి, పార్టీలోని కార్యకర్తలందరి సహకారంతో పార్టీకి కట్టుబడి పని చేస్తానన్నారు. తనకు పదవి ఇచ్చిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డికి సదా రుణపడి ఉంటానని, సంతోషాన్ని వ్యక్తం చేశారు. సీడీసీ చైర్మెన్ రాంరెడ్డి, బ్లాక్ ప్రెసిడెంట్



చాట్ల సిద్దన్న, మండల పార్టీ ప్రెసిడెంట్ ఒగ్గు శ్రీనివాస్ కు ప్రతేక ధన్యవాదములు తెలిపారు.

# నకిలీ ఎక్స్ ఖాతా ఆధారంగా అసెంబ్లీని తప్పుదోవ పట్టించిన సీఎం రేవంత్ రెడ్డి

- రూల్ 168 కింద సభా హక్కుల ఉల్లంఘన నోటీసు

**పటాన్ చెరు, సెప్టెంబర్ 10, (సిరి న్యూస్):**

బుధవారం నాడు తెలంగాణ శాసన సభలో జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నకిలీ ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలోని పోస్టును ఆధారంగా చేసుకుని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కె. చంద్రశేఖర్ రావు ప్రతిష్ఠకు భంగం కలిగించేలా నిరాధార ఆరోపణలు చేశారని, పవిత్రమైన శాసన సభను తప్పుదోవ పట్టించారని ఆరోపిస్తూ శాసనసభ నియమావళి రూల్ 168 కింద సభా హక్కుల ఉల్లంఘన నోటీసు అందజేశారు. ఈ మేరకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, పటాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కలిసి అసెంబ్లీ సెక్రటరీ రెడ్ల తిరుపతి కి సభా హక్కుల ఉల్లంఘన నోటీసును అందజేశారు. చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'బీఆర్ఎస్ అంతర్జాతీయ కార్యదర్శి సంధ్యారావు' పేరిట ఉన్నట్లు పేర్కొన్న నకిలీ ఎక్స్ ఖాతాలోని పోస్టును శాసనసభలో చదివి వినిపించారని వారు తెలిపారు. బీఆర్ఎస్‌లో లేని 'అంతర్జాతీయ కార్యదర్శి' పదవిని సృష్టించి, ఆ పేరుతో రూపొందించిన నకిలీ సోషల్ మీడియా ఖాతాలోని సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ముఖ్యమంత్రి స్వయంగా శాసన సభలో ప్రస్తావించడం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని పేర్కొన్నారు. పవిత్రమైన చట్టసభలో అవాస్తవ,



నిరాధార మరియు వాస్తవ విరుద్ధమైన సమాచారాన్ని ప్రదర్శించడం ద్వారా సభా గౌరవానికి భంగం కలిగించడంతో పాటు, సభ్యులను తప్పుదోవ పట్టించే పరిస్థితి ఏర్పడిందని వారు ఆరోపించారు. అందువల్ల నకిలీ ఎక్స్ ఖాతా లోని సమాచారాన్ని ఆధారంగా చేసుకుని శాసన సభలో వాస్తవ విరుద్ధమైన ప్రకటనలు చేసిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పై రూల్ 168 కింద సభా హక్కుల ఉల్లంఘన నోటీసును అంద జేశామని తెలిపారు. ఈ అంశాన్ని తక్షణమే పరిశీలించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ సెక్రటరీని వారు కోరారు.

# అంతర్జాతీయ క్రీడాపోటీలలో రాణించిన గీతం విద్యార్థిని

**పటాన్ చెరు, సెప్టెంబర్ 10, (సిరి న్యూస్):**

పికిల్ బాల్ ప్రపంచ కప్ 2026లో రెండు పతకాలు సాధించిన బీబీఏ తొలి ఏడాది విద్యార్థి ఆశ్రిత వియత్నాం లో ఇటీవల జరిగిన అంతర్జాతీయ పికిల్ బాల్ ప్రపంచ కప్ 2026 పోటీలలో, హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, బీబీఏ తొలి ఏడాది విద్యార్థిని ఆశ్రిత రాజు దాట్ల రెండు పతకాలు సాధించి సంస్థకు గర్వకారణంగా నిలిచారు. 18 ఏళ్ల లోపు విభాగంలో పోటీ పడిన ఆశ్రిత, అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, బాలికల సింగిల్స్ లో రజత పతకాన్ని, డబుల్స్ లో కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. ఒక అంతర్జాతీయ క్రీడా పోటీలలో సింగిల్స్, డబుల్స్.. రెండింటిలోనూ పతకాలు సాధించడం ఒక గొప్ప ఘనత. ఇది ప్రపంచ వేదికపై రాణించాల నే ఆమె ప్రతిభ, క్రమశిక్షణ, పట్టుదల, సంకల్పానికి నిదర్శనం. ఆశ్రిత సాధించిన ఈ విజయం ఆమె కఠోర శ్రమ, నిబద్ధత, పికిల్ బాల్ పట్ల ఉన్న అభిరుచికి నిదర్శనం.



ఆమె విజయం, చదువుకు అతీతంగా రాణించడం, సర్వతోముఖాభివృద్ధికి దోహదపడే అవకాశాలను అంది పుచ్చుకోవడం ప్రాముఖ్యతను కూడా చాటి చెబుతోంది. ఒక అంతర్జాతీయ క్రీడా కార్యక్రమంలో గీతం కు ప్రాతినిధ్యం వహించడం ద్వారా, ఇతర రంగాలలో రాణించాలని ఆకాక్షించే తోటి విద్యార్థులకు ఆమె స్ఫూర్తిగా నిలిచారు. గీతం నాయకత్వం, ఆశ్రిత సాధించిన ఈ అద్భుత విజయానికి అభినందించి, ఆమె అంకితభావం, క్రీడా స్ఫూర్తి, శ్రేష్ఠత పట్ల నిబద్ధతను ప్రశంసించింది. ఆమె మరిన్ని విజయాలను సాధించి, మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ప్రోత్సహించారు. వియత్నాం లో తన అద్భుతమైన ప్రదర్శనతో, ఆశ్రిత వర్ధమాన యువ క్రీడాకారులకు ఒక గొప్ప ప్రమాణాన్ని నెలకొల్పింది. అంకితభావం, పట్టుదల, నిరంతర కృషితో ఆశయాలను అంతర్జాతీయ వేదికపై విజయాలు గా మార్చు కోవచ్చని ఆమె ప్రస్థానం నిరూపిస్తోంది.

# వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగించాలి

- బీజేపీ మండల అధ్యక్షుడు చింతల యాదగిరి ముదిరాజ్

**గుమ్మడిదల, సెప్టెంబర్ 10 (సిరి న్యూస్):**

తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలతో పోరాడి, పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమని భారతీయ జనతా పార్టీ గుమ్మడిదల మండల అధ్యక్షుడు చింతల యాదగిరి ముదిరాజ్ అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం మండల పరిధిలోని కానుకుంట గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చింతల యాదగిరి ముదిరాజ్ మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. భూస్వామ్య దోపిడీ, అన్యాయాలకు వ్యతిరేకంగా ఆమె చూపిన ధైర్యం, తెగువ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మహిళలు కూడా సామాజిక మార్పు కోసం ముందుండి పోరాడగలరని చాకలి ఐలమ్మ తన పోరాటం ద్వారా నిరూపించారని అన్నారు.

**బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలి**

చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు నర్సపల్లి రాజిరెడ్డి పిలుపునిచ్చారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం నెలకొల్పేందుకు కృషి చేయడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఆమె పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు పలుకు గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమొల్ల యాదగిరి, ఉపాధ్యక్షుడు అందిపురం రాజు, బూత్ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, మోర్చా అధ్యక్షుడు అనిల్ రెడ్డి, శివశంకర్, సత్యనారాయణ, ఆంజనేయులు, రజక సంఘం అధ్యక్షుడు నర్సంగారి శేఖర్, నర్సంగారి మురళి, సుధాకర్, వెంకటేష్, లక్ష్మణ్, నరేష్, కృష్ణ, జనార్దన్, అనిల్, బాను, బిక్షపతి, రజక సంఘం సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళులర్పించారు.



# జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

- కానుకుంట ఉన్నత పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**గుమ్మడిదల, సెప్టెంబర్ 10 (సిరి న్యూస్):**

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు వారిని ఉన్నతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని గ్రామ సర్పంచ్ పెంటా రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కానుకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలిగా పురస్కారం అందుకున్న వి.బి. నీరజ, జిల్లాస్థాయిలో ఉత్తమ



గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్న అప్పిరెడ్డిని గ్రామ సర్పంచ్ పెంటా రెడ్డి, గ్రామ పెద్దలు, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి, పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులలో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ఉత్తమ పురస్కారాలు అందుకోవడం పాఠశాలకు, గ్రామానికి గర్వకారణమని అన్నారు. ఉపాధ్యాయుల అంకితభావం, క్రమశిక్షణ, నిరంతర కృషికి ఈ పురస్కారాలు నిదర్శనమని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను మాత్రమే బోధించకుండా, క్రమశిక్షణ, నైతిక విలువలు, సమాజం పట్ల బాధ్యత వంటి అంశాలను కూడా నేర్పిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కొండాపూర్‌లో వన్ వార్డ్ ఎవరీ డే

- -ప్రజల సమస్యలపై సీఎంసీ కమిషనర్ క్షేత్రస్థాయి సమీక్ష

**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 10(సిరి న్యూస్):**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 'వన్ వార్డ్ ఎవరీ డే' కార్యక్రమంలో భాగంగా కమిషనర్ జి.శ్రీజన శేరిలింగంపల్లి జోన్‌లోని కొండాపూర్ వార్డును స్వయంగా సందర్శించారు.శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, సర్కిల్ అధికారులు, ఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధులు ఆమెతో పాటు పాల్గొన్నారు.ఆఫీసు గదుల్లో కాకుండా వీధుల్లోనే ప్రజలను కలిసిన కమిషనర్,




వార్డులోని ప్రధాన పౌర సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్టార్మ్ వాటర్ డ్రైన్లు, వీధి దీపాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, పార్కుల నిర్వహణ, ఆక్రమణల తొలగింపు, తాగునీటి సరఫరా విషయాల్లో నివాసితులు లేవనెత్తిన ఫిర్యాదులను విన్నారు. పనులు ఆలస్యం కాకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, ప్రతిపాదిత అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.గణేశ్ చతుర్థి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల బదులు మట్టి విగ్రహాలను వాడాలని స్థానికులకు సూచించారు. పర్యావరణానికి హాని కలగకుండా పండుగను నిర్వహించాలని పిలుపునిస్తూ, క్షేత్రస్థాయిలోనే మట్టి గణేశ్ విగ్రహాలను పంపిణీ చేశారు. సీఎంసీ అధికారులు చెప్పిన ప్రకారం, వన్ వార్డ్ ఎవరీ డే కార్యక్రమం ద్వారా 76 వార్డుల్లోనూ ప్రజల సమస్యలను నేరుగా గుర్తించి పరిష్కరించే ప్రయత్నం కొనసాగుతోంది.కొండాపూర్‌లో లేవనెత్తిన అంశాలపై తదుపరి చర్యల నివేదికను సమర్పించాలని కమిషనర్ స్పష్టం చేశారు.

# చెడు వ్యసనాలతోనే ఆత్మహత్యలకు దారితీస్తున్న యువత

- ప్రేమ వైఫల్యం, బెట్టింగ్, డ్రగ్స్ ప్రధాన కారణాలు
- పిల్లల మొబైల్ వినియోగంపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి
- ఆత్మహత్యల నివారణకు అవగాహన కార్యక్రమాలు
- సిరి పత్రిక న్యూస్ తో
- జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

**రామాయంపేట, సెప్టెంబర్ 10 (సిరి న్యూస్)**



చెడు వ్యసనాలకు యువత బానిసలవడం వల్లే అనేక ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నాయని జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ అన్నారు. ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన సిరి న్యూస్ తో మాట్లాడారు. జిల్లాలో ప్రతి సంవత్సరం సుమారు 300 ఆత్మహత్య ఘటనలు నమోదవుతున్నాయని, వీటిలో యువత సంఖ్య గణనీయంగా ఉంటోందని తెలిపారు. ప్రేమలో వైఫల్యం, బెట్టింగ్ యాప్‌ల ద్వారా అప్పుల్లో కూరుకుపోవడం, డ్రగ్స్‌కు అలవాటు పడటం తదితర కారణాలతో కొందరు యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ప్రస్తుతం మొబైల్ ఫోన్ల వినియోగం ద్వారా ప్రేమ వ్యవహారాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, డ్రగ్స్ వంటి వ్యసనాలకు యువత ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లల మొబైల్ వినియోగాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. పిల్లల ప్రవర్తనలో ఆకస్మిక మార్పులు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వారితో స్నేహపూర్వకంగా మాట్లాడాలని కోరారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు ఒంటరిగా బాధపడకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఉపాధ్యాయులు లేదా నిపుణులను సంప్రదించేలా యువతకు అవగాహన కల్పించాలన్నారు. ఆత్మహత్యల నివారణకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అదనపు ఎస్పీ తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని, ధైర్యంగా ఎదుర్కొని పరిష్కార మార్గాలను అన్వేషించాలని ఆయన పిలుపునిచ్చారు.

# మహిళ చైతన్యానికి ప్రతీక చాకలి ఐలమ్మ



- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పటాన్ చెరు లో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమం.

**పటాన్ చెరు , సెప్టెంబర్ 10, (సిరి న్యూస్):**

గడీల పై గళ మెత్తి, తెలంగాణ రాష్ట్రంలో భూ పోరాటానికి నాంది పలికి, మహిళా చైతన్యానికి ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి పురస్కరించుకొని.. పటాన్చెరు డివిజన్ పరిధిలోని రజక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన 41వ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే జీఎంఆర్ పాల్గొని.. చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక భూమిక పోషించి మహిళా చైతన్యానికి స్ఫూర్తిగా నిలిచిన చాకలి ఐలమ్మ పేరును హైదరాబాదులోని మహిళా విశ్వవిద్యాలయానికి నామకరణం చేశారని గుర్తు చేశారు. వారి వారసులకు సైతం సముచిత గౌరవం కల్పించారని పేర్కొన్నారు. ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, రజక సంఘం అధ్యక్షుడు మహేష్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# మట్టి గణపతే మహా గణపతి

- మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం''
- పండుగను సామరస్యంతో సంతోషంగా జరుపుకోవాలి.
- జిల్లా అధికారులకు మట్టి వినాయక ప్రతిమలు అందించిన కలెక్టర్,ఎస్పీ.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

**మెదక్ సెప్టెంబర్,10(సిరి న్యూస్)**



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలో వేడుకలను ప్రశాంత వాతావరణంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గురువారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ డీవి శ్రీనివాసరావు, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి, తూప్రాన్ ఆర్డీవో బావయ్యలతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక చవితి వేడుకల సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. గణేష్ మండపాల ఏర్పాటు,విద్యుత్, పారిశుద్ధ్యం,తాగునీరు, రహదారులు తదితర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేసి వినాయక చవితి వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు మాట్లాడుతూ మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా వేడుకలను నిర్వహించాలని తెలిపారు. జిల్లా అధికారులకు మట్టి వినాయక ప్రతిమలు కలెక్టర్ ,ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ,రెవిన్యూ ,గ్రామపంచాయతీ, వైజాగ్ శాఖ, విద్యుత్ , ఫైర్ , ఆర్ అండ్ బి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వివిధ శాఖల అధికారులు, , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాల శాంతి కమిటీ సమావేశం



**పెద్ద శంకరం పేట, సెప్టెంబర్ 10, (సిరి న్యూస్):**

రాబోయే వినాయక చవితి పండగ ప్రశాంతంగా జరుపు కొనుట గురించి పెద్ద శంకరం పేట మండల పరిధిలోని అన్ని గ్రామాల వినాయక మండపాల నిర్వాహకుల మీటింగ్ శంకరంపేట పోలీస్ స్టేషన్ లో నిర్వహించారు. స్థానిక ఎస్ ఐ ప్రవీణ్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ పండుగను ప్రశాంత వాతావరణం లో జరుపుకోవాలని సూచించారు. వినాయక మండపాల దగ్గర తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిమజ్జనం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన వివరించారు. అలాగే ఆన్లైన్ ఫామ్ ఎలా నింపాలి అనే విషయాన్ని వారికి తెలియ జేశారు.

# శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

- జోగిపేట మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, చిట్టిబాబు
- ఎన్టీఆర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభం

**జోగిపేట, సెప్టెంబర్ 10, (సిరి న్యూస్):**



విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు చాలా అవసరమని అందోలు-జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి అన్నారు. జోగిపేట మున్సిపల్ గ్రౌండ్ లో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (Sఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక దృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. మండల స్థాయిలో గెలిచిన విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎదిగి అందోల్ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులకు మా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే క్రీడల పట్ల ఆసక్తి చూపాలని, క్రీడల వల్ల మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు ముదిరాజ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. క్రీడామైదానం అభివృద్ధికి మంత్రి కోట్ల రూపాయలను మంజూరు చేసారన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి Sఎఈ క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఎం. జగన్ మోహన్ రెడ్డి, ఎంఈఓ బండి కృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు ఆకుల మాణయ్య, S హెడ్ మాస్టర్లు నరేష్, రమేష్, పీఆర్‌టీయు అర్బన్ అధ్యక్షుడు నరోత్తం, పీఈటీల సంఘం మండల అధ్యక్షుడు సుభాష్ గౌడ్, పీఈటీలు వీబీ శ్రీనివాస్, రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగించాలి





- ప్రధానోపాధ్యాయులు సాంబయ్య

**వెల్దుర్తి,సెప్టెంబర్ 10, (సిరి న్యూస్ ):**

పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెల్దుర్తి నందు తెలంగాణ వీరనారి, ధైర్యసాహసాలకు ప్రతీక చాకలి ఐలమ్మ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఐలమ్మ ధైర్యం, పోరాట స్ఫూర్తి, పేదలు మరియు బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటాన్ని విద్యార్థులకు వివరించారు. ఆమె జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, అన్యాయాన్ని ఎదిరించే ధైర్యాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ప్రధానోపాధ్యాయులు సాంబయ్య సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటస్వామి, శ్రీనివాసరావు, నరసింహారెడ్డి, అర్చన, అమూల్య, జయసుధ, సునీత, వాణిశ్రీ, విజయ మోహన్ రాజ్, ఖదీర్ పాషా,రేణుక, ప్రశాంతి,, రాము తదితరులు, బోధనేతర సిబ్బంది యాదగిరి, మహేష్, రాజు, సి ఆర్ పి రాజు, శ్రీనివాస్ లు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘన నివాళులు అర్పించారు. చాకలి ఐలమ్మ చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని కార్యక్రమంలో పేర్కొన్నారు.

# దుర్గం చెరువుకు రెండు రోజులు తాళం!



- హెచ్.ఎం.డబ్లు.ఎస్.ఎస్బి పనుల నేపథ్యంలో సందర్శకుల ప్రవేశం నిలిపివేత

**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 10,( సిరి న్యూస్):**

సైబరాబాద్ లో ప్రముఖ వినోద, పర్యాటక కేంద్రంగా నిలిచిన దుర్గం చెరువుకు గురువారం, శుక్రవారం రోజుల్లో సందర్శకుల ప్రవేశం నిలిపివేయబడింది. సదుపాయాలను మెరుగుపరచేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు చేపట్టిన నిర్వహణ పనుల నేపథ్యంలో సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ఈ నిర్ణయం తీసుకుంది.సెప్టెంబర్ 10,11 తేదీల్లో చెరువు ప్రాంగణంలోకి ప్రజల ప్రవేశం తాత్కాలికంగా నిషేధించినట్లు సీఎంసీ ప్రకటించింది. ఈ రెండు రోజులు బోటింగ్, వాక్‌వే, ఇతర సందర్శన సౌకర్యాలు అందుబాటులో ఉండవని అధికారులు స్పష్టం చేశారు.సిఎంసి ప్రజలకు విడుదల చేసిన సూచనలో సందర్శకులు ఈ విషయాన్ని గమనించి, ఆయా తేదీల్లో దుర్గం చెరువు ప్రాంగణానికి రావడం నివారించి,తమ సందర్శనను తదనుగుణంగా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు.వారాంతాల్లో పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చే ఈ చెరువు వద్ద గురువారం సాయంత్రం నుంచే ప్రవేశ నియంత్రణ అమల్లోకి వచ్చినట్లు సమాచారం.12వ తేదీ నుంచి తిరిగి తెరుచుకుంటుందో లేదో అధికారిక నిర్ధారణ కోసం సీఎంసీ,హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు ప్రకటనలను గమనించాలని అధికారులు సూచిస్తున్నారు.

# పండ్ల వ్యాపారులు ఫుట్ పాత్ ఆక్రమణ

- పండ్లు విక్రయించే వ్యాపారులకు సూచనలు
- ఫుట్ పాత్ పై వ్యాపారాలు చేయరాదు
- ఫుట్ పాత్ ఆక్రమణతో
- పాదాచారులకు ఇబ్బందులు
- నర్సాపూర్ పోలీస్ శాఖ

**నర్సాపూర్ సెప్టెంబర్ 10 (సిరి న్యూస్)**

పండ్ల షాపుల ముందు రోడ్డుపై, రోడ్డు మార్జిన్‌లో ఫుట్ పాత్ పై పండ్ల బండ్లు, బాక్సులు, టేబుళ్లు తదితర సామగ్రిని ఏర్పాటు చేసి వ్యాపారం చేయడం ద్వారా ట్రాఫిక్‌కు, పాదచారులకు ఇబ్బంది కలిగించరాదు నర్సాపూర్ బస్టాండ్ పరిసర ప్రాంతాలలో చౌరస్తా పరిసరాల్లో రోడ్డును ఫుట్ పాత్ ఆక్రమించి పండ్ల బండ్లు ఏర్పాటుతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్నదని పోలీసుల శాఖ తరఫున ఇప్పటికే పలుమార్లు సూచనలు చేసినప్పటికీ నిబంధనలు పాటించని వ్యాపారులపై ఇకపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు రోడ్డుపై పండ్ల బండ్లతో రోడ్డును ఆక్రమించి వ్యాపారం చేయడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదు పండ్ల వ్యాపారులు తమ బండ్లు, పండ్ల బాక్సులు ఇతర సామగ్రిని రోడ్డు పైకి తీసుకురాకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నిర్ణీత/అనుమతించబడిన ప్రదేశంలోనే వ్యాపారం చేయాలని పట్టణ ప్రజలు ప్రజా ప్రతినిధులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో పోలీసు శాఖకు సహకరించాలని ప్రకటనలు తెలిపారు.

# సమతుల్య ఎరువుల వినియోగంతో మంచి దిగుబడులు




- పంటలో సమస్యలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి
- రైతులకు ఏడీఏ మనోహర సూచన

**గుమ్మడిదల, సెప్టెంబర్ 10 (సిరి న్యూస్):**

కందిపంటలో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు సమతుల్య ఎరువుల వినియోగంతో పాటు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ మనోహర సూచించారు. గుమ్మడిదల మండల పరిధిలోని నల్లవల్లి గ్రామంలో సాగు చేస్తున్న కందిపంటను వ్యవసాయ శాఖ అధికారులు గురువారం సందర్శించి పంట పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మనోహర మాట్లాడుతూ కందిపంటలో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు సమతుల్య ఎరువుల వినియోగంతో పాటు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పంటలో పురుగులు, తెగుళ్లను ప్రారంభ దశలోనే గుర్తించి వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. పంట ఎదుగుదల, నేల పరిస్థితిని బట్టి అవసరమైన యాజమాన్య పద్ధతులను పాటించాలని, సమస్యలు తలెత్తినప్పుడు స్వయంగా మందులు వినియోగించకుండా అధికారులను సంప్రదించాలని సూచించారు. రైతులకు ఎప్పటికప్పుడు సాంకేతిక సలహాలు అందిస్తూ అధిక దిగుబడులు సాధించేలా వ్యవసాయ శాఖ మార్గనిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు. రైతులకు వ్యవసాయ శాఖ తరఫున ఎప్పటికప్పుడు సాంకేతిక సలహాలు, సూచనలు అందిస్తూ అధిక దిగుబడులు సాధించేలా మార్గనిర్దేశం చేస్తున్నామని తెలిపారు. సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా కందిపంటను పురుగులు, తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు. రైతులు తమ పొలాలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ పంట ఎదుగుదలను గమనించాలని సూచించారు. పంటలో ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు స్వయంగా మందులు వినియోగించకుండా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి వారి సూచనల మేరకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు సుమిత, వందన, బీటీఎం స్పందన, ఏటీఎం సాయికిరణ్, రైతులు మధు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రామాయంపేటను రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి.

- సీఎం, రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళ్లాలి.
- మున్సిపల్ కౌన్సిలర్ జే. శంకర్ గౌడ్..



**రామాయంపేట, సెప్టెంబర్ 10 (సిరి న్యూస్)**

రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసి ఈ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం చొరవ చూపాలని స్థానిక మున్సిపాలిటీ 8వ వార్డు బిజెపి కౌన్సిలర్ జే. శంకర్ గౌడ్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం గతంలో అన్ని వర్గాల ప్రజలు ఏకతాటిపైకి వచ్చి సుదీర్ఘంగా ఉద్యమాలు నిర్వహించినా ఫలితం లేకపోయిందని అన్నారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నందున మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ఈ విషయాన్ని ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు జరిగితే ప్రజలకు పరిపాలనా సౌలభ్యం కలగడంతో పాటు ఈ ప్రాంతంలో అభివృద్ధి వేగవంతమయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు పూర్తికావస్తున్నా రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించకపోవడం విచారకరమన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రామాయంపేట ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడిందని తెలిపారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు కూడా ఎమ్మెల్యేపై ఒత్తిడి తీసుకువచ్చి డివిజన్ ఏర్పాటు కోసం కృషి చేయాలని సూచించారు. రామాయంపేట ప్రజల చిరకాల ఆకాంక్షను ప్రభుత్వం నెరవేర్చాలని, రెవెన్యూ డివిజన్ ఏర్పాటును అధికారికంగా ప్రకటించి తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని జే. శంకర్ గౌడ్ డిమాండ్ చేశారు.

# వెల్దుర్తి లో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు..



**వెల్దుర్తి,సెప్టెంబర్ 10, (సిరి న్యూస్):**

వెల్దుర్తి మండల కేంద్రంలోరజక సంఘం ఆధ్వర్యంలో గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను ఘనంగా జరుపుకోవడం జరిగింది.. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దండెం ఆదర్శ్ ఉపసర్పంచ్ శ్రవణ్ కుమారులు పాల్గొన్నారు.ఈ సందర్భం వారు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి అణచవేత కోసం పోరాడైన యోధురాలే చాకలి ఐలమ్మ అని చెప్పారు , ఉప సర్పంచ్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. వీరనారి చాకలి ఐలమ్మ పోరాడిన తీరును చేసిన గొప్ప పనులను ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్, శ్రీనివాస్ గౌడ్, రజక సంఘం నాయకులు దుర్గయ్య, నాగేష్, ముత్యాలు, రాములు, కుమార్, మహేష్, బాలేష్, తదితరులు పాల్గొన్నారు...

# పోషణ మాసం అవగాహన కార్యక్రమం!!

**శివంపేట సెప్టెంబర్ 10 ( సిరి న్యూస్ )**

శివంపేట మండల కేంద్రంలోని తాళ్లపల్లి తాండా అంగన్వాడీ కేంద్రంలో ఈనెల 9వ తారీకు నుంచి అక్టోబర్ 8 వ తారీకు వరకు పోషణ మాసం సందర్భంగా గ్రామంలోని తల్లులకు మరియు కిషోర బాలికలకు పోషకాహారం, ఆరోగ్యం మరియు సమతుల్య ఆహారం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక సర్పంచ్ ధనవత్ లక్ష్మి హాజరయ్యారు. అలాగే పంచాయతీ సెక్రటరీ, వార్డు సభ్యులు మరియు అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, స్థానికంగా సులభంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు మరియు ఇతర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ప్రతిరోజూ తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్వైజర్ సంతోషా మాట్లాడుతూ, తక్కువ ఖర్చుతో లభించే అధిక పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ప్రతిరోజూ తీసుకోవడం వల్ల పిల్లలు, తల్లులు మరియు కిషోర బాలికలు ఆరోగ్యంగా ఉండవచ్చని వివరించారు. అలాగే సమతుల్య ఆహారం తీసుకోవడం యొక్క ప్రాధాన్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయురాలు మరియు అంగన్వాడీ టీచర్లు మరియు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.




# ఉపసర్పంచుల చెక్ పవర్‌ను తొలగించొద్దు!

- మండల ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు తాటి పవన్ కుమార్ గుప్తా!!

**శివంపేట సెప్టెంబర్ 10 ( సిరి న్యూస్ )**



తెలంగాణ రాష్ట్రంలోని ఉపసర్పంచుల చెక్ పవర్‌ను తొలగించకుండా కొనసాగించాలని శివంపేట మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు తాటి పవన్ కుమార్ గుప్తా ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉపసర్పంచులకు గుర్తింపు, గౌరవం కల్పిస్తూ చెక్ పవర్‌ను అందించిందని అన్నారు.ఉపసర్పంచులకు చెక్ పవర్ ఉండటం వల్ల సర్పంచులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, గ్రామాభివృద్ధి పనుల్లో ఇద్దరూ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల విషయంలో పారదర్శకత ఉండేలా ప్రతి నెలా గ్రామసభ నిర్వహించాలని పవన్ కుమార్ గుప్తా సూచించారు. సర్పంచు చేపట్టిన అభివృద్ధి పనులకు ఉపసర్పంచు సంతకం లేకపోయినా, ఉపసర్పంచు చేపట్టిన పనులకు సర్పంచు సంతకం లేకపోయినా, ఆ పనుల వివరాలను గ్రామసభలో ప్రజల సమక్షంలో వెల్లడించే విధానం తీసుకురావాలని కోరారు. గ్రామసభలో అభివృద్ధి పనుల వివరాలను ప్రజలకు తెలియజేసి, గ్రామసభ తీర్మానం ఆధారంగా సంబంధిత చెక్కులకు ఆమోదం లభించే విధంగా ప్రభుత్వం స్పష్టమైన నిబంధనలు రూపొందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనివల్ల గ్రామాల్లో అభివృద్ధి పనుల్లో పారదర్శకత పెరగడంతో పాటు, ప్రజలకు పూర్తి సమాచారం అందుతుందని పేర్కొన్నారు. ఉపసర్పంచులకు ఇప్పటికే కల్పించిన చెక్ పవర్‌ను తొలగించి వారి గౌరవాన్ని తగ్గించవద్దని పవన్ కుమార్ గుప్తా ప్రభుత్వాన్ని కోరారు. సర్పంచులు, ఉపసర్పంచులు పరస్పర సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేసే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని తాటి పవన్ కుమార్ గుప్తా శివంపేట మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# పేదల కోసం పోరాడిన చాకలి ఐలమ్మ..



**టేక్మాల్, సెప్టెంబర్ 10 ( సిరి న్యూస్ )**

చాకలి ఐలమ్మ పేదల పక్షాన నిలబడి పోరాటం చేసిన నాయకురాలు అని టేక్మాల్ రజక సంఘం నాయకులు ఎర్రోళ్ల రమేష్ పేర్కొన్నారు. గురువారం నాడు మండల కేంద్రమైన టేక్మాల్ లో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎర్రోళ్ల రమేష్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ బడుగు బలహీన వర్గాల కోసం, నిరుపేదల కోసం, భూస్వామ్య వ్యవస్థకు ఎదురుగా నిలిచి పోరాడారని అన్నారు. ఐలమ్మ ఎంతోమందికి ప్రేరణ నిచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్య, మధు, సాయి, వంశీ,లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# వీరనారీ చాకలి ఐలమ్మ

- చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి.
- ఘనంగా చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు.
- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్.

**మెదక్ సెప్టెంబర్,10(సిరి న్యూస్)**



వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్ అన్నారు.గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ తో కలిసి చాకలి ఐలమ్మ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి, పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చెరగని ముద్ర వేసిన గొప్ప మహిళా యోధురాలని అన్నారు. సామాజిక అన్యాయం, జమీందారీ వ్యవస్థ, దోపిడీకి వ్యతిరేకంగా ఆమె ధైర్యంగా పోరాడి అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. 1895లో జన్మించిన చాకలి ఐలమ్మ నిరుపేద కుటుంబంలో పుట్టి ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ, ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాటం చేశారని తెలిపారు. విస్నూర్ దేశ్‌ముఖ్ దోపిడీకి వ్యతిరేకంగా ఆమె చేసిన సాహసోపేతమైన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం, రైతాంగ ఉద్యమాల్లో ఆమె పోషించిన పాత్ర మహిళల ధైర్యసాహసాలకు నిదర్శనమని కొనియాడారు సమాజంలో అసమానతలను తొలగించేందుకు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గౌలిదొడ్డిలో ఘోర రోడ్డు ప్రమాదం

- ముగ్గురు యువకులు తీవ్ర గాయాలు

శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 10 (సిరి న్యూస్): గచ్చిబౌలి సమీపంలోని గౌలిదొడ్డి జయభేరి ఫోర్ సీజన్స్ సిగ్నల్ వద్ద గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.గోపన్‌పల్లి నుంచి గౌలిదొడ్డి వైపు వెళ్తున్న మారుతి ఆల్టో కారును (టీఎస్ 07 ఎఫ్‌క్యూ 4482)రాంగ్ రూట్లో అధిక వేగంతో వచ్చిన టిప్పర్ లారీ (ఏపీ 01 డబ్ల్యూ 6022) ఢీకొట్టడంతో కారులో ఉన్న దర్గుపల్లి జ్ఞానేశ్వర్, బి. శ్రీనివాస్ యాదవ్, కొన్ర సంతోష్‌లు తీవ్రంగా గాయపడ్డారు.ముగ్గురినీ 108 సేవల ద్వారా మెడికవర్ ఆసుపత్రికి తరలించగా, ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.స్థానిక న్యాయవాది డి.ప్రశాంత్ కుమార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో లారీ డ్రైవర్ ర్యాష్‌గా, నిర్లక్ష్యంగా, రాంగ్ రూట్లో వాహనం నడిపి ప్రమాదం తలపెట్టినట్లు ఆరోపించారు. పోలీసులు కేసు నమోదు చేసి రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సిగ్నల్ కెమెరాలు, సిసిటీవీ ఫుటేజ్ పరిశీలిస్తూ లారీ డ్రైవర్, యజమాని వివరాలు సేకరిస్తున్నారు.గౌలిదొడ్డి,గోపన్‌పల్లి మార్గంలో భారీ వాహనాలు అధిక వేగంతో నడవడం సర్వసాధారణమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తూ,జయభేరి సిగ్నల్ వద్ద కఠిన నిఘా పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి

**మెదక్ సెప్టెంబర్,10(సిరి న్యూస్)**

భూమికోసం,భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మందుగుల గంగాధర్ అన్నారు. ఆమె వర్ధంతి సందర్భంగా మెదక్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని వెల్కమ్ బోర్డు చౌరస్తాలో గల చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. భూస్వామ్య దోపిడీ నిరంకుశత్వానికి ఎదురు నిలిచి పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు,దొరల గడిలను బద్దలు కొట్టి అణగారిన వర్గాలకు ఉద్యమ కెరటం నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అహరెల్లి మైనార్టీ పట్టణ అధ్యక్షులు మహమ్మద్ ఫాజిల్, మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఓమర్,అస్త్రగల్ల బాలరాజు, పిల్లి కొట్టాల నాగరాజు, బాలరాజు యాదవ్, సోషల్ మీడియా ఎండి మైసన్, మొండి పద్మారావు,నాగిరెడ్డి,శ్రీనివాస్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.



# పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

- గ్రామపంచాయతీ, అంగన్వాడి బిల్డింగ్స్ , స్కూల్ కాంపౌండ్ వాల్స్ పెండింగ్ పనులు పూర్తి చేయాలి
- పూర్తయిన వాటిని ప్రజా ప్రతినిధుల సమన్వయంతో
- వెంటనే ప్రారంభించాలి.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.




**మెదక్ సెప్టెంబర్,10(సిరి న్యూస్)**

జిల్లాలో వివిధ పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసి ప్రజాప్రతినిధుల సమన్వయంతో ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.విబిజిరామ్ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. వి బి జి రామ్ (వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ ) కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నూతనంగా జిల్లాలో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనాలు 82, అంగన్వాడీ భవనాలు 55 , గోడౌన్ లు 8 ల పెండింగ్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ పిఆర్ నర్సింలు, డిఆర్డిఓ శ్రీనివాస్ రావు, సంక్షేమ శాఖ అధికారి హేమ భార్గవి, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, సి డి పి ఓ లు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓల్డ్ ఎంఐజీలో కూల్చివేతలు

**రామచంద్రపురం, సెప్టెంబర్ 10 (సిరి న్యూస్):**



అమీన్‌పూర్ పరిధిలోని భారతీ నగర్ డివిజన్ ఓల్డ్ ఎంఐజీలో అధికారులు కూల్చివేతలు చేపట్టారు. నిబంధనల అమలులో భాగంగా నిర్వహించిన ఎన్ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లో ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అమీన్‌పూర్ డీసీ పర్యవేక్షణలో జరిగిన ఈ డ్రైవ్‌లో నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు, ప్లానింగ్ నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాలను పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా లేని నిర్మాణాలపై వర్తించే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రాంతంలోని పరిస్థితిని పర్యవేక్షిస్తూ, అవసరాన్ని బట్టి తదుపరి చర్యలు చేపడతామని సంబంధిత అధికారులు తెలిపారు.

# పేటలో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు



**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 10, (సిరి న్యూస్):**

పెద్ద శంకరంపేట పట్టణం రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి జరుపుకున్నారు. పెద్ద శంకరంపేట పట్టణ శివారు లోని తిరుమలా పూర్ చెరువు కట్ట వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం బాధ్యులు, నాయకులు, పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. భూమి కోసం, భుక్తి కోసం, అణగారిన వర్గాల కోసం నిరంతరం పోరాడిన తెలంగాణ వీర వనిత అని ఆమె చేసిన సేవలు గురించి కొనియాడారు। ఈ కార్యక్రమంలో పేట మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్ ఎన్ సంతోష్ కుమార్ , సుభాష్ గౌడ్, రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చాకలి నారాయణ, మండల అధ్యక్షుడు చాకలి ప్రభు, బాధ్యులు కిష్టయ్య, సాయి, దస్తయ్య, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకులను పూజిద్దాం పర్యావరణాన్ని రక్షిద్దాం



- -హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినాయక ప్రతిమల పంపిణీ

**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 10 (సిరి న్యూస్):**

వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకులను పూజించాలని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పిలుపునిచ్చారు.హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ఏడాది 6,500 మట్టి ప్రతిమల ఉచిత పంపిణీని గురువారం తన నివాసంలో ప్రారంభించారు. చెరువులు కలుషితం కాకుండా చూడాలని, మొక్కలు పెంచాలని అన్నారు.12 ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్‌ను అభినందించారు .ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యుడు బసిరెడ్డి మధుసూదన్ రెడ్డి, సింగదాసరి రాజశేఖర్ పాల్గొన్నారు.

# గోమారంలో మండల స్థాయి ఎస్ జి ఎఫ్ క్రీడలు !




- ముఖ్య అతిథులుగా ఎంఈఓ బుచ్చ నాయక్!!

**శివంపేట సెప్టెంబర్ 10 (సిరి న్యూస్ )**

శివంపేట మండల కేంద్రంలోని జడ్.పి.హెచ్.ఎస్ గోమారం పాఠశాల గ్రౌండ్ లో శివంపేట మండల విద్యాధికారి ముఖ్య అతిథిగా హాజరు అయి ఎస్ జి ఎఫ్ క్రీడలు ప్రారంభించారు.వాలీబాల్, ఖో ఖో కబడ్డీ గేమ్స్ ఉంటాయి అని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గ్రామ సర్పంచు మరియు గ్రామ నాయకులు మాధవరెడ్డి ఉపసర్పంచు ఫ్లేమింగ్ లబరెటరీ యాజమాన్యం రాజేందర్. రత్నాకర్ ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు లు పీడీలు ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది. మొదటిరోజు వాలీబాల్ పోటీ లో జడ్.పి.హెచ్.ఎస్ శివంపేట పాఠశాల ప్రథమ స్థానము రెండవ స్థానము జడ్.పి.హెచ్.ఎస్ రత్నపూర్ పాఠశాల కు రావడం జరిగింది అని అన్నారు.ఈ ఆటల పోటీలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ఫ్లైమింగ్ యాజమాన్యం బహుమతులు ఇవ్వడానికి ముందుకు రావడం జరిగిందని ఎంఈఓ బుచ్చయ్య నాయక్ అన్నారు.

# చెరువులు, కాలువలపై అధికారుల ఎంక్వయిరీ..







**హత్నూర, సెప్టెంబర్ 10 (సిరి న్యూస్):**

హత్నూర మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో చెరువులు, కాలువలకు సంబంధించిన అంశాలపై అధికారులు గురువారం ఎంక్వయిరీ చేపట్టారు. కోడిపాక గ్రామంలోని హన్మంత్‌కుంట నుంచి మట్టి తరలించినట్లు వచ్చిన ఫిర్యాదుపై అధికారులు వివరాలు సేకరించారు. తుర్కలఖానాపూర్ గ్రామంలోని శెట్టి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో చదును చేసి అచ్చుకట్టినట్లు వచ్చిన ఫిర్యాదుపై పరిశీలన నిర్వహించారు. ఇదే గ్రామంలోని పీర్లకుంట ఆయకట్టు కాలువకు పలకలు వేసినట్లు వచ్చిన అంశంపై కూడా అధికారులు విచారణ చేపట్టారు. ఈ ఎంక్వయిరీలో హత్నూర మండల ఆర్ఐ రంగయ్య, ఇరిగేషన్ ఏఈఈ శ్రీకాంత్‌తో పాటు మండల లస్కర్లు పాల్గొన్నారు. ఆయా ప్రాంతాలను పరిశీలించి, పరిస్థితులపై వివరాలు నమోదు చేసినట్లు తెలిసింది. విచారణ అనంతరం నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# కేటీఆర్, హరీష్‌లపై లైంగిక వేధింపుల కేసు

**హైదరాబాద్, సెప్టెంబర్ 10:**

తెలంగాణ శాసనసభ సమావేశాల తొలిరోజు అసెంబ్లీ గేట్ వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల నిరసన తీవ్ర వివాదానికి దారితీసింది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ నల్ల టీషర్టుల తో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ నేతలను గేట్ నంబర్ 3 వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, బీఆర్ఎస్ నేతలకు మధ్య తోపులాట జరగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మహిళా పోలీసులపై దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు.

**మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదుతో కేసు**

సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తానీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యే డి.సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు నేతలపై కేసులు నమోదయ్యాయి. నినాదాలతో కూడిన టీషర్టులు ధరించిన వారిని నిబంధనల ప్రకారం లోపలికి అనుమతించబోమని చెప్పినందుకు తమను తీవ్ర పదజాలంతో దూషించారని కానిస్టేబుల్ ఆరోపించారు. నిరసన సందర్భంగా కొందరు నేతలు టీషర్టులు విప్పి అర్ధనగ్నంగా తమ వైపునకు వచ్చారని, దీంతో తీవ్ర అసౌకర్యానికి, మానసిక వేదనకు గురయ్యామని ఫిర్యాదులో పేర్కొన్నారు. తోపులాటలో మహిళా సిబ్బందిపై శారీరక ఒత్తిడి తెచ్చి విధులకు ఆటంకం కలిగించారని, అధికారంలోకి వచ్చిన తర్వాత చూసుకుంటామని బెదిరించారని ఆరోపించారు. ఘటనలో తాను మానసికంగా, శారీరకంగా గాయపడి చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

**కక్షసాధింపు చర్యలంటున్న బీఆర్ఎస్**

మరోవైపు కేసు నమోదుపై బీఆర్ఎస్ తీవ్రంగా స్పందించింది. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా ప్రతిపక్ష నేతలను అడ్డుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసులు పెట్టిందని ఆరోపించింది. తమ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో పోలీసులు దురుసుగా వ్యవహరించిన అంశం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేసులు నమోదు చేశారని కేటీఆర్, హరీశ్‌రావు వర్గాలు విమర్శించాయి. మరోవైపు బీఆర్ఎస్ నేతల తీరును నిరసిస్తూ కాంగ్రెస్ మహిళా ఎమ్మెల్యేలు మహిళా కమిషన్‌ను ఆశ్రయించడంతో వివాదం మరింత ముదిరింది.

**సెక్షన్లతో మరింత ఉత్కంఠ**

భారతీయ న్యాయ సంహితలోని 74, 75(1), 79, 121(1), 132 తదితర సెక్షన్ల కింద కేసు నమోదు కావడంతో రాజకీయ వేడి పెరిగింది. ప్రజాప్రతినిధులపై మహిళా పోలీసుల విధులకు ఆటంకం, అసభ్య ప్రవర్తన, బెదిరింపుల ఆరోపణలు రావడంతో పోలీసుల దర్యాప్తుపై ఆసక్తి నెలకొంది. ఈ వ్యవహారం రానున్న రోజుల్లో అసెంబ్లీ లోపల, బయట కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య రాజకీయ ఘర్షణకు మరింత ఆజ్యం పోసే అవకాశముంది.

# రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు



**హైదరాబాద్, సెప్టెంబర్10:**

సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి నకిలీ ఎక్స్ (X) ఖాతాను ఆధారంగా చూపించి సభను తప్పుదోవ పట్టించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శికి ఎమ్మెల్యేలు బండారు లక్ష్మా రెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు అందజేశారు. ముఖ్యమంత్రి సభలో ఫేక్ ఎక్స్ ఖాతాను చూపించి చేసిన వ్యాఖ్యలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. నకిలీ ఖాతాను ఆధారంగా చేసుకుని అసెంబ్లీని తప్పుదోవ పట్టించేలా వ్యవహరించారని పేర్కొన్నారు. ఈ చర్య ద్వారా సభ గౌరవానికి భంగం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే సీఎం చేసిన నిరాధార ఆరోపణల వల్ల బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రతిష్టకు భంగం కలిగిందని ఎమ్మెల్యేలు ఆరోపించారు. సభలో ఆధారాలు లేని విషయాలను ప్రస్తావించడం సరికాదని, దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై అసెంబ్లీ నిబంధనల్లోని రూల్ 168 కింద సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చినట్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తెలిపారు. ఇదే అంశంపై అసెంబ్లీ స్పీకర్‌కు కూడా లేఖ రాశారు. సీఎం వ్యాఖ్యలను పరిశీలించి, సభా నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మొత్తంగా నకిలీ ఎక్స్ ఖాతాను అసెంబ్లీలో ప్రస్తావించిన అంశం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మరోసారి రాజకీయ వివాదానికి దారితీసింది. ఈ వ్యవహారంపై స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

# విద్యార్థి, యువ నాయకుల అరెస్టులపై బీఆర్ఎస్వీ ఆగ్రహం



**రామచంద్రపురం, సెప్టెంబర్ 10 (సిరి న్యూస్):**

అర్ధరాత్రి విద్యార్థి, యువ నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్వీ తీవ్రంగా ఖండించింది. పటాన్‌చెరు నియోజకవర్గ అధ్యక్షుడు కమ్మెట చెన్నారెడ్డిని పోలీసులు అరెస్టు చేశారని నాయకులు తెలిపారు. విద్యార్థి నాయకుల అరెస్టుల ద్వారా ఉద్యమాలను అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వారు ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్నో పోరాటాలు చేసినా ఇలాంటి అరెస్టులు చూడలేదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాలనా తీరుకు ఈ అరెస్టులే నిదర్శనమని విమర్శించారు. అరెస్టులు, కేసులకు తాము భయపడబోమని, విద్యార్థులు, యువత సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు.

# స్పీకర్‌పై వ్యాఖ్యల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు షాక్?

**హైదరాబాద్, సెప్టెంబర్ 10:**

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిలకు సంబంధించి న్యాయపరమైన ఉత్కంఠ కొనసాగుతోంది. ఇప్పటికే ఇద్దరికీ మంజూరైన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ సైఫాబాద్ పోలీసులు నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. కోర్టు విధించిన షరతులను ఉల్లంఘించడంతోపాటు దర్యాప్తు, సాక్ష్యాలను ప్రభావితం చేసేలా వ్యవహరించారని పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు.

**అసెంబ్లీ వద్ద ఆందోళనతో కేసు**

అసెంబ్లీ వద్ద జరిగిన ఆందోళన సందర్భంగా పోలీసులతో వాగ్వాదానికి దిగడం, విధులకు ఆటంకం కలిగించడం, స్పీకర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేయడంపై సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో పోలీసులు రిమాండ్ కోరినప్పటికీ నాంపల్లి కోర్టు ఇద్దరు ఎమ్మెల్సీలకు బెయిల్ మంజూరు చేసింది. అయితే బెయిల్ సమయంలో విధించిన నిబంధనలకు విరుద్ధంగా వారు వ్యవహరించారని పోలీసులు ఆరోపిస్తూ బెయిల్ రద్దు పిటిషన్ దాఖలు చేశారు.

**ఎస్సీ, ఎస్టీ కోర్టుకు బదిలీ చేయాలని..**

కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విచారణను ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టుకు బదిలీ చేయాలని కూడా పోలీసులు నాంపల్లి కోర్టును కోరారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దళిత సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కావడంతో ఆయనపై చేసిన వ్యాఖ్యలకు అట్రాసిటీ చట్టంలోని నిబంధనలు వర్తిస్తాయని పోలీసులు పేర్కొన్నారు. దీంతో ఈ వ్యవహారం మరింత కీలకంగా మారింది.

**బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం**

పోలీసుల చర్యలపై బీఆర్ఎస్ తీవ్రంగా మండిపడుతోంది. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ప్రభుత్వం వరుస కేసులు, పిటిషన్లతో ఎమ్మెల్సీలను వేధిస్తోందని ఆరోపించింది. తాతా మధు, నవీన్‌రెడ్డి ఎలాంటి నిబంధనలను ఉల్లంఘించలేదని, చట్టపరంగానే వ్యవహరిస్తూ కోర్టులో కేసును ఎదుర్కొంటామని బీఆర్ఎస్ న్యాయ విభాగం నేతలు చెబుతున్నారు.

**కోర్టు ఉత్తర్వులపై ఉత్కంఠ**

బెయిల్ రద్దు, కేసు బదిలీపై నాంపల్లి కోర్టు త్వరలో విచారణ చేపట్టనుంది. బెయిల్ రద్దయితే ఇద్దరు ఎమ్మెల్సీలు తిరిగి జైలుకు వెళ్లే పరిస్థితి ఏర్పడొచ్చు. కేసు ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టుకు బదిలీ అయితే తదుపరి విచారణ అట్రాసిటీ చట్టం పరిధిలో కొనసాగనుంది. ఈ పిటిషన్లపై న్యాయస్థానం ఇచ్చే ఉత్తర్వులపై తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో మళ్లీ వేడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 10:**

అసెంబ్లీలో సీఎల్పీ సమావేశం అనంతరం కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు మరోసారి పార్టీలో చర్చకు దారితీశాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తనకు భిన్నాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని, వాటిని సీఎం, తన మధ్య వ్యక్తిగత విభేదాలుగా చిత్రీకరించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆయన అన్నారు. మంచి జరిగితే మంచని, తప్పు జరిగితే తప్పని నిర్భయంగా చెప్పడం తన స్వభావమని స్పష్టం చేశారు.

**మంత్రి పదవిపై కీలక వ్యాఖ్యలు**

తనకు మంత్రి పదవి దక్కుతుందన్న ప్రచారంపైనా రాజగోపాల్‌రెడ్డి స్పందించారు. మంత్రి పదవి ఇవ్వడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతిలో ఉందదని, అది పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని చెప్పారు. పదవి కోసం తాను ఎప్పుడూ రాజీపడలేదని స్పష్టం చేశారు.

**ప్రచారంపై మండిపాటు**

ముఖ్యమంత్రిని కలిస్తే రాజీపడ్డారని, కలవకపోతే ఇద్దరి మధ్య దూరం పెరిగిందని కొందరు ప్రచారం చేయడం సరికాదని రాజగోపాల్‌రెడ్డి మండిపడ్డారు. తన రాజకీయ వైఖరిని వ్యక్తిగత సంబంధాలతో ముడిపెట్టి తప్పుడు ప్రచారం చేయొద్దని ఆయన సూచించారు.

# అత్యంత బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారు

- **తుమ్మల పనితీరుపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :**



వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పనితీరుపై బీజేపీ శాసనసభ్యులు పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. పార్టీలు వేరైనా ప్రజలకు మంచి చేసే నాయకుడిని, వారి నిబద్ధతను గుర్తించి మెచ్చుకోవడంలో తప్పులేదని వారు స్పష్టం చేశారు. 'మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు అత్యంత బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారు. ప్రజాప్రతినిధులుగా మేము కూడా ఇంతటి ఓపిక, జవాబుదారీతనం ఉన్న మంత్రిని గతంలో చూడలేదు' అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఏ సమస్యపై ఫోన్ చేసినా మంత్రి తుమ్మల వెంటనే స్పందిస్తారని, ఆదివారాలు లేదా సెలవు రోజుల్లో కూడా ప్రజా సమస్యలపై అందుబాటులో ఉంటారని తెలిపారు. సమీక్షలు లేదా పనుల్లో ఉండి ఫోన్ తీయలేకపోయినా వీలైనంత త్వరగా తిరిగి ఆయనే కాల్ చేసి మాట్లాడతారని చెప్పారు. ప్రజలు లేదా నియోజకవర్గాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళితే ఎంతో ఓపికతో విని ఆ సమస్య పూర్తయ్యే వరకు అధికారులతో స్వయంగా మాట్లాడతారన్నారు. పని ఏ దశలో ఉందో, ఎప్పుడు పరిష్కారమవుతుందో కూడా మళ్లీ తిరిగి ఫోన్ చేసి అప్‌డేట్ ఇవ్వడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. శాసనసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు, తోటి మంత్రులు తుమ్మల పాలనా సమర్థతను, ఓపికను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యేలు సూచించారు.

# పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన బస్సు

**హైదరాబాద్, సెప్టెంబర్ 10:**

హైదరాబాద్ శివారులో ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన ఘటన కలకలం రేపింది. అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని బాటసింగారం వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు పక్కనే ఉన్న పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన బస్సు రెండు కార్లు, ఓ ఆటోను ఢీకొట్టగా అవి ధ్వంసమయ్యాయి. అంతేకాక డీజిల్ పంపును కూడా బస్సు ఢీకొనడంతో బంకు పరిసరాల్లో ఒక్కసారిగా భయానక పరిస్థితి నెలకొంది. ప్రమాదం జరిగిన సమయంలో పెట్రోల్ బంకు వద్ద పెద్దగా జనసంచారం లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. భారీ ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నప్పటికీ అదృష్టవశాత్తూ పెను ముప్పు తప్పింది. బస్సు అదుపుతప్పి బంకులోకి దూసుకెళ్లిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయింది. బైక్‌ను తప్పించబోయే సమయంలోనే బస్సు డ్రైవర్ నియంత్రణ కోల్పోయినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బస్సు డ్రైవర్ పరిస్థితి, ప్రమాద సమయంలో వాహనం వేగం, ఇతర సాంకేతిక కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలిస్తూ ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

# రూ.కోటి బీమా.. దేశంలోనే తొలిగా

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పెన్షనర్లకు అందిస్తున్న రూ.కోటి బీమా పథకం దేశంలోనే తొలిసారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ప్రకటించారు. ఉద్యోగి దురదృష్టవశాత్తు మరణించినా అతడి కుటుంబం ఆర్థికంగా రోడ్డున పడకుండా భద్రత కల్పించాలనే మానవీయ ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వంపై, ఉద్యోగులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా బ్యాంకుల సహకారంతో పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమాద బీమా, హెల్త్ కార్డుల గురించి సభ్యులు గురువారం అడిగిన ప్రశ్నలకు ఉప ముఖ్యమంత్రి వివరణాత్మకంగా జవాబిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 16 బ్యాంకులతో ఒప్పందం చేసుకుని రెగ్యులర్ ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి బీమా కవరేజీ కల్పిస్తోందన్నారు. ఈ మేరకు 2024 జూన్ 26న ఆర్థిక శాఖ 77వ జీవో జారీ చేసిందని, పథకం అమలు విధానం, అర్హతలు, బీమా కవరేజీ, నిబంధనలు, షరతులను అందులో పేర్కొందని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగి కుటుంబానికి రూ.కోటి బీమాతోపాటు ఇతర ప్రయోజనాలు కలిపి రూ.1.20 కోట్ల వరకు ప్రయోజనం అందేలా చర్యలు తీసుకున్నట్లు డిప్యూటీ సీఎం చెప్పారు. విమాన ప్రయాణ సమయంలో ప్రమాదం జరిగితే రూ.2 కోట్ల వరకు బీమా ప్రయోజనం కల్పిస్తున్నట్లు వెల్లడించించారు. సహజ మరణానికి రూ.10 లక్షల వరకు ప్రయోజనం కల్పించే వెసులుబాటు కూడా ఉన్నట్లు చెప్పారు.

**12.91 లక్షల మందికి కవరేజీ**

రాష్ట్రంలో మొత్తం 12,91,056 మంది ఈ పథకం పరిధిలో ఉన్నట్లు, వీరిలో 5,18,293 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నట్లు చెప్పారు. ఇంకా 5,00,158 మంది తాత్కాలిక, ఔట్‌సోర్సింగ్, మల్టీపర్పస్ వర్కర్లు, కాంట్రాక్ట్, డైలీవేజ్, ఎన్ఆర్ఈజీఎస్, ఎంటీఎస్, సెర్ప్ తదితర సిబ్బంది ఉన్నారు. 2,72,600 మంది పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు ఉన్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి వివరించారు.

**సింగరేణితో శ్రీకారం**

ఉద్యోగుల కోసం రూ.కోటి బీమా పథకానికి తొలుత సింగరేణి కాలరీస్‌లో శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ పరిధిలోని డిస్కమ్‌లు, ఇతర సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పథకాన్ని విస్తరించినట్లు చెప్పారు. చివరగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ వర్తించేలా విస్తరించినట్లు పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగులకు 2024 ఫిబ్రవరిలో, ఇంధన శాఖ ఉద్యోగులకు 2025లో, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ 2026 జూన్ 25 నుంచి పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

**ప్రభుత్వానికి రూపాయి భారం లేదు**

ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్న బ్యాంకులతో ప్రభుత్వం చర్చలు జరిపి ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగుల జీతాలు తమ బ్యాంకుల ద్వారా జమ అవుతున్నందున, బ్యాంకులకు వ్యాపారపరంగా ప్రయోజనం కలుగుతున్న నేపథ్యంలో బీమా పథకానికి బ్యాంకులే సహకరించేలా ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. దీంతో ప్రభుత్వంపై, ఉద్యోగులపై ఎలాంటి ప్రీమియం భారం లేకుండా పథకం అమలవుతోందన్నారు.

**ఇప్పటికే క్లెయిమ్‌ల పరిష్కారం**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఇప్పటివరకు 33 క్లెయిమ్‌లు వచ్చాయని, వాటిలో 24 క్లెయిమ్‌లను పరిష్కరించినట్లు తెలిపారు. విద్యుత్ శాఖకు చెందిన ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, టీజీ జెన్‌కో, ట్రాన్స్‌కో పరిధిలో 15 క్లెయిమ్‌లు రాగా అన్నింటినీ పరిష్కరించినట్లు చెప్పారు. ఈ విభాగంలో రూ.15 కోట్లకు పైగా చెల్లింపులు జరిగినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా సింగరేణి కాలరీస్‌లో 50 క్లెయిమ్‌లు రాగా అన్నింటిని పరిష్కరించినట్లు తెలిపారు.

**కేంద్రం, ఇతర రాష్ట్రాలు అధ్యయనం**

రాష్ట్రంలో ప్రారంభించిన ప్రమాద బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అధ్యయనం చేసిందని ఉప ముఖ్యమంత్రి సభకు చెప్పారు. ఇతర రాష్ట్రాలు సైతం తెలంగాణలో అమలు చేస్తున్న ఈ బీమా విధానాన్ని పరిశీలించేందుకు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. తమిళనాడు కూడా ఈ తరహా పథకాన్ని అమలు చేసినట్లు ఆయన వెల్లడించారు.

**ఉద్యోగులకు హెల్త్‌కార్డు**

బీమా పథకంతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం హెల్త్‌కార్డు పథకాన్ని కూడా తీసుకొచ్చినట్లు డిప్యూటీ సీఎం చెప్పారు. దశాబ్దాలుగా ఉద్యోగ సంఘాలు కోరుతున్న క్యాష్‌లెస్ వైద్య సేవల కలను ప్రభుత్వం సాకారం చేసిందని చెప్పారు. ఉద్యోగులు, వారి సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంబంధిత ముఖ్య కార్యదర్శులతో కమిటీ ఏర్పాటు చేసి చర్చల అనంతరం హెల్త్‌కార్డుల విధానాన్ని ఖరారు చేసినట్లు వివరించారు. క్యాష్‌లెస్ వైద్యం, సీజీహెచఎస్ ప్యాకేజీ వంటి సదుపాయాలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. హెల్త్‌కార్డు పథకం కోసం ఇప్పటికే సుమారు రూ.240 కోట్ల నిధులు కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ఉద్యోగుల సంక్షేమానికి బీమా, ఆరోగ్య భద్రతకు హెల్త్‌కార్డు, రెండు పథకాలూ ఉద్యోగ కుటుంబాలకు ఆర్థిక, వైద్య భరోసా కల్పించేలా రూపొందించామని ఉప ముఖ్యమంత్రి భట్టి శాసనసభకు చెప్పారు.

# 17న పబ్లిక్ గార్డెన్‌లో ప్రజా పాలన దినోత్సవం

- **ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష**
- **వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పక్కా ఏర్పాట్లు చేయాలి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :**



పబ్లిక్ గార్డెన్‌లో ఈనెల 17న నిర్వహించే తెలంగాణ ప్రజా పాలన దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై సచివాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆరోజు ఉదయం అసెంబ్లీ ఎదురుగా గల అమరవీరుల స్థూపం వద్ద ముఖ్యమంత్రి నివాళులర్పించి అనంతరం పబ్లిక్ గార్డెన్‌కు వస్తారని తెలిపారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద, పబ్లిక్ గార్డెన్‌లో సంబంధిత అధికారులు తగు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. నగరంలోని పలు ప్రధాన భవనాలకు, చారిత్రక కట్టడాలకు విద్యుద్దీపాల అలంకరణ చేపట్టాలన్నారు. ఈనెల 15న డ్రెస్ రిహార్సల్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రజాపాలన దినోత్సవానికి వేయిమంది స్వయం సహాయక మహిళలతోపాటు రెండు వేల మంది హాజరవుతారన్నారు. సమావేశానికి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు నవీన్ మిట్టల్, క్రిస్టినా చొంగ్తూ, శిఖా గోయల్, హైదాబాద్ సి.పి.సజ్జనార్, ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి తదితర సీనియర్ అధికారులు హాజయ్యారు.

వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పక్కా ఏర్పాట్లు చేయాలి

వానాకాలం (202627 ఖరీఫ్) సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లపై ఆయా శాఖల ఉన్నతాధికారులతో సీఎస్ గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. సుమారు 57.7 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, 119.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్లు సీఎస్ తెలిపారు. సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు. గత సీజన్‌లో సుమారు 70 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగి 154.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా 71.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు సీఎస్ తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8,283 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సీఎస్ వెల్లడించారు. ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), ఇతర కొనుగోలు ఏజెన్సీల సమన్వయంతో కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ నుంచి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం ప్రారంభమవుతుందని, నవంబర్‌లో పెద్దఎత్తున ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున ముందుగానే అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ధాన్యం రవాణా, హమాలీల ఏర్పాటు, గోదాములు, నిల్వ సామర్థ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ ఆదేశించారు.

# మూసీ పునరుజ్జీవం పేరిట విధ్వంసం వద్దు

- **నదిని, పర్యావరణాన్ని, ప్రజల హక్కులను కాపాడాలి**
- **ప్రజలను నిర్వాసితులను చేసే విధానాన్ని మార్చాలి**
- **మూసీ రివర్ ప్రాజెక్టును పునః సమీక్షించాలి**
- **మూసీ జన ఆందోళన్ డిమాండ్**

**హైదరాబాద్, సెప్టెంబరు 10:**

మూసీ నది పునరుజ్జీవనం పేరుతో చేపడుతున్న ప్రస్తుత మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు నదిని శుద్ధితో పాటు ప్రజల ఇళ్లు, జీవనోపాధులు, పర్యావరణాన్ని రక్షించే విధంగా ఉండాలని, ప్రజలను నిర్వాసితులను చేసే ప్రాజెక్టు విధానాన్ని మార్చాలని డిమాండ్ చేస్తూ మూసీ జన ఆందోళన ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. తొలుత దళిత బహుజన ఫ్రంట్ నాయకుడు శంకర్ సభకు ఆహ్వానం పలికారు. డొమెస్టిక్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు మంజుల బస్తీ ప్రజల నిర్వాసితుల బాధలను ప్రతిబింబించే పాటతో కార్యక్రమం ప్రారంభమైంది. సీనియర్ జర్నలిస్ట్, సామాజిక కార్యకర్త సజయ సభకు అధ్యక్షత వహించారు. మానవ హక్కుల వేదిక నాయకుడు జీవన్ కుమార్ ప్రారంభోపన్యాసం చేస్తూ మూడు దశాబ్దాలుగా మూసీ నది, దాని పరివాహక ప్రాంత ప్రజలపై ప్రభుత్వాలు అనుసరి స్తున్న విధానాలను వివరించారు. ప్రస్తుత మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు ప్రజలకు, నదికి ప్రయోజనం కలిగించే విధంగా లేదన్నారు. ఈ సందర్భంగా 'మూసీ పునరుజ్జీవం పేరిట విధ్వంసమా? - నదిని కాపాడుకుందాం, ప్రజాహక్కులను రక్షించుకుందాం' అనే కరపత్రాన్ని తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు విడుదల చేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు పరిధిలోని బాధితులు, సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్ తమ అనుభవాలను వివరించారు. ప్రభుత్వం వివిధ రకాలుగా ప్రజలను మభ్యపెట్టడం, భయపెట్టడం, ఒత్తిడికి గురిచేయడం జరుగుతోందని తెలిపారు. బాపుఘాట్, హైదర్‌షాకోట్, బుద్వేల్, హైదర్‌గూడ, చాదర్‌ఘాట్ ప్రాంతాలతోపాటు మూసీ దిగువ ప్రాంత గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు వైశాలి, సుధా గోపరాజు, బిలాల్, ముస్కన్, అనిత, కొమురయ్య, బట్టు శంకర్, బాలయ్య తదితరులు తమ ఇళ్లు, పొలాలను ఏ పరిస్థితుల్లోనూ వదిలేది లేదని స్పష్టం చేశారు. మూసీ జన ఆందోళన కొనసాగిస్తున్న ప్రజా ఉద్యమానికి మద్దతుగా వివిధ పార్టీల ప్రతినిధులు ధర్నాలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఎల్‌బీనగర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టీఆర్ఎస్ తరపున మనోజ్, న్యూడెమోక్రసీ తరపున ఝాన్సీ, సీపీఐ తరపున స్టాలిన్ పాల్గొని మూసీ ప్రాజెక్టు బాధితులకు తమ మద్దతును తెలిపారు. పర్యావరణవేత్తలు డాక్టర్ బాబూరావు, డాక్టర్ దొంతి నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ప్రాజెక్టు వల్ల సంభవించే పర్యావరణ ప్రభావాలను వివరించారు. రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో పర్యావరణ అంశాలను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టును ప్రస్తుత రూపంలో వ్యతిరేకించాలని, నదిని కేవలం ఒక నగర అభివృద్ధి ప్రాజెక్టుగా కాక మొత్తం నది పరివాహక ప్రాంతం ప్రాతిపదికన చూడాలని వారు సూచించారు. ప్రజా సంఘాల ప్రతినిధులు సంధ్య, మీరా సంఘమిత్ర, జ్యోతి, ఉషా సీతాలక్ష్మి, విమలక్క, సిస్టర్ లిసి, శంకర్, అఖిల్, రవి కన్నెగంటి, వేణు, సంజీవ్ తదితరులు మాట్లాడుతూ, మూసీ బాధితులకు అండగా ఉంటామని తెలిపారు. ప్రజలకు, మూసీ నదికి న్యాయం చేయని ఏ ప్రాజెక్టునైనా నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం మూసీ నదిని శుభ్రపరిచేందుకు ₹7,345 కోట్ల మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టును చేపట్టిందని తెలిపారు. ఇందులో ఫేజ్ 1ఎ హిమాయత్ సాగర్ నుంచి 9.1 కి.మీ, ఫేజ్ 1బి గండిపేట నుంచి 11.8 కి.మీ పరిధిలో గాంధీ సరోవర్ పేరుతో పనులు చేపడుతున్నారన్నారు.

# తెలంగాణ అభివృద్ధికి మోదీ చారిత్రక నిర్ణయం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 :**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ సమావేశంలో తెలంగాణకు అత్యంత ప్రయోజనకరమైన సికింద్రాబాద్ (ఘట్‌కేసర్)కాజీపేట బహుళ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టుకు ఆమోదం లభించడం పట్ల హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నట్లు రైల్వే స్టాండింగ్ కమిటీ సభ్యుడు, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఎనిమిది రైల్వే మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు రూ.20,804 కోట్లతో బుధవారం ఆమోదం తెలుపగా ఇందులో సికింద్రాబాద్‌ఘట్‌కేసర్‌కాజీపేట మార్గం తెలంగాణ రైల్వే వ్యవస్థకు జీవనాడి వంటిదన్నారు. సరకు రవాణా వేగవంతమై పరిశ్రమలు, రైతులు, వ్యాపారులు, యువతకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ నిర్ణయం ప్రధాని మోదీ వికసిత భారత్, వికసిత తెలంగాణ సంకల్పానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు లు రహదారి, రైలు, పరిశ్రమలు, మార్కెట్ల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేస్తాయని, రవాణా వ్యయం తగ్గి, సరఫరా వ్యవస్థ మరింత సమర్థవంతంగా మారుతుందని తెలిపారు. తెలంగాణకు ప్రయోజనాలు సికింద్రాబాద్‌కాజీపేట కారిడార్‌లో రద్దీ తగ్గి రైళ్ల సమయ పాలన, సేవా విశ్వసనీయత మెరుగుపడుతుందని డాక్టర్ లక్ష్మణ్ తెలిపారు. ప్రయాణికుల రైళ్లతోపాటు బొగ్గు, సిమెంట్, ఇనుముఉక్కు, కంటైనర్లు, ఆటోమొబైళ్లు, ఆహార ధాన్యాలు, పెట్రోలియం ఉత్పత్తులు, ఎరువుల రవాణాకు అదనపు సామర్థ్యం ఏర్పడుతుందన్నారు. తెలంగాణలోని పరిశ్రమలకు సరకు రవాణా సౌలభ్యం పెరిగి లాజిస్టిక్స్ వ్యయం తగ్గే అవకాశం ఉంటుందని, నిర్మాణ దశలో ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. అనుబంధ సేవా రంగాలకు కూడా ఉత్సాహం లభిస్తుందన్నారు. యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, భువనగిరి కోట వంటి ఆధ్యాత్మిక, పర్యాటక ప్రదేశాలకు చేరువ మెరుగవుతుందన్నారు. ప్రధాని మోదీ తెలంగాణపై చూపుతున్న ప్రత్యేక శ్రద్ధకు ఈ నిర్ణయం స్పష్టమైన నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా ప్రధానికి, రైల్వే శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.